ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు

జిల్లా వార్తలు 5

బుధవారం 7 ఆగస్టు 2024

సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

కర్నూలు(లీగల్), ఆగస్టు 6: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.వెంకట లీలా శేషాద్రి తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటుకు తీసుకోవాల్సిన ఏర్పాట్లపై మంగళవారం స్థానిక లోక్ అదాలత్ కార్యాలయంలో మున్సిపల్, పంచాయితీరాజ్, ఇన్సురెన్స్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్నీ ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు సహకరించాలని అధికారులను కోరారు.



జోహరాపురంలో కూలడానికి సిద్ధంగా వున్న పశువుల ఆసుపత్రి

- గత వైసీపీ ప్రభుత్వంలో పథకాలన్నీ ఎత్తివేత
- పోషణ బరువై సంతల్లో అమ్మేస్తున్న రైతులు
- నాటు వైద్యులే దిక్కు.
- శిథిలావస్థలో పశు ఆసుపత్రులు
- అద్దె భారం సిబ్బందికే

పడకేసిన.. పశు వైద్యం

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 6:

జిల్లాలో బతుకు భారమైన రైతులు మూగజీవాలను వదిలించుకోక తప్పని పరిస్థితి వచ్చేసింది. గత వైసీపీ ప్రభుత్వం పశువులపై కనికరం లేకుండా ఘోరంగా వ్యవహరించింది. అంతకుముందటి టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలన్నీ గాలిలో కలిపేసింది. పశువైద్యాన్ని కనీసంగా పట్టించుకోలేదు. పశువుల ఆసుపత్రుల్లో కనీస వసతులు కరువయ్యాయి. వైద్య సిబ్బంది ప్రైవేట్ భవనాలకు సొంతంగా అద్దె చెల్లించి ఆసుపత్రులను నెట్టుకొస్తున్నారు.

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో రూ. లక్షల్లో ఎద్దులు, ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు ఉన్నాయి. పశువుల పోషణ కష్టమై రైతులు సంతల్లో అమ్మేస్తున్నారు. కరువు వల్ల దాణా దొరకని ఇబ్బందికి తోడు వైద్య సదుపాయాలు కూడా సరిగా లేక రైతులు ఇబ్బందిపడుతున్నారు. కర్నూలు నగరంలో 11 ప్రాంతీయ పశువైద్యశాలలు, 66 పశు పర్యవేక్షక కేంద్రాలు, 76 గ్రామీణ పశువైద్యశాలలు ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లాలో 15 పశువైద్యశాలలు, 74 పశుపర్యవేక్షక కేంద్రాలు, 99 గ్రామీణ పశువైద్యశాలలు ఉన్నాయి. వీటికి తోడుగా గ్రామాల్లో గోపాలమిత్ర పేరుతో గౌరవ వేతనంతో అవసరమైన శిక్షణను అందించే కొంత మందిని నియమించారు. గ్రామాల్లోని పశువైద్యులు నెలంతా డ్యూటీ చేయాలి. అయితే వాచ్‌మెన్‌లు, కాంపౌండర్లకు పశువుల వైద్యాన్ని అప్పగించేసి డాక్టర్లు ఎంచక్కా కర్నూలు, నంద్యాలలో ప్రైవేటు వ్యాపారాలు చేసుకుంటు న్నారు. వారానికి ఒకటి లేదా రెండు రోజులు ఆసుపత్రికి వచ్చి హాజరు పట్టీలో సంతకం పెట్టి 1 గంటకే తిరుగు ముఖం పడ్తున్నారు. ప్రస్తుతం క్రిటికల్ వైద్యాన్ని కూడా సిబ్బందికే వదిలేసి వైద్యులు తమ ప్రైవేటు కార్యకలాపాలకే పరిమితమైపోతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పశువైద్యశాలలు మూతప డ్తున్నాయని తెలిసినా ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తి నట్లు ఉండిపోతున్నారు తప్ప చర్యలు తీసుకొనేందుకు ఏ మాత్రం దృష్టి పెట్టడం లేదు.

చాలీచాలని మందులు

పశువులకు ఏదైనా రోగం వస్తే ఇవ్వాల్సిన మామూలు మందులు కూడా ఆసుపత్రుల్లో ఉండటం లేదు.

- జిల్లాలో పశువైద్యశాలలు పాలిక్లినిక్‌లు, ఒక సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ డిస్పెన్సరీలు రూరల్ లైవ్‌స్టాక్ యూనిట్లు ఉన్నాయి. అధ్వాన స్థితిలో ఉన్న భవనాలు 50కి పైగానే ఉన్నాయి.
- ప్రతి మూడు నెలలకోసారి మందుల కేటాయిస్తున్నట్లు చెబుతున్నారేగాని వాస్తవంగా అయిదారు నెలలకోసారి సప్లయ్ చేస్తున్నారు. రాష్ట్రంలోని ఆసుపత్రిలన్నింటికీ ఏడాదికి (వ్యాక్సిన్ లేకుండా) రూ. 30 కోట్లు మందులు తదితర వైద్యపరికరాలకు కేటాయిస్తున్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాలకు ఈ మొత్తం ఏ మూలకు సరిపోతుందో పాలకులకే తెలియాలి. ఒక పశువుకు ఏడాదికి ఒక రూపాయి మాత్రమే ఖర్చు చేస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే గత వైసీపీ ప్రభుత్వం మూగజీవాల వైద్యంపై ఎంత నిర్లక్ష్యం చూపిందో అర్థమవుతుంది. గతంలో సీజన్‌కు అనుగుణంగా మందుల సరఫరా ఉండేది. మిగిలిన రోజుల్లో రైతులు కొనుక్కోవాల్సిందే. ఏపీఎల్‌డీఏ ద్వారా గ్రామాల్లో గౌరవ వేతనంపై పశువైద్యం చేస్తున్న గోపాల మిత్రలకు కొన్ని రకాల మందులు సరఫరా జరిగేది. గత ఐదేళ్ల నుంచి వాటిని ఈ మందులు అందించడం లేదు. పాముకాటుకు వాడే యాంటి వీనయ్, కుక్కలకు రేబిస్ నివారణ మందుల సరఫరా లేదు. వాటిని రైతు కొనుక్కోవాలంటే రూ. 800 నుంచి రూ. 1000 ఖర్చు అవుతోంది. పశువులు నాము తింటే అనారోగ్యం పాలవుతాయి. వాటికి హైపో అనే మందు అత్యవసరమైనా అందుబాటులో లేదు. పశు సంవర్ధకశాఖ ఈ మందును సప్లయ్ చేయడం లేదు. చిన్న చిన్న గాయాలకు అవసరమైన పౌడర్లను మాత్రం ఇస్తున్నారు. ఇంజక్షన్లను సరఫరా చేయడం లేదు. నొప్పులు, బి. కాంప్లెక్స్(ఆకలికి) యాంటీ బయాటిక్స్ మందులను ఆసుపత్రిలకు తెప్పించడంలేదు. వాటి ఖరీదెక్కువ. కనీసం వాటిని మూడు రోజులు వాడాలి.

పేరుకు మాత్రమే సూపర్ స్పెషాలిటీ

రూ. 2 కోట్లు ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన కర్నూలు నగరంలోని బహుళార్థ వైద్యసేవా కేంద్రం కూడా కేవలం పెంపుడు జంతువులకు నామ మాత్ర సేవలు అందించడానికే పరిమితమైపోయింది. ఇక్కడ సరిపడా వైద్యులు కూడా అందుబాటులో లేకపోవడం దారుణం. ప్రజల ఆరోగ్యం కోసం ఆసుపత్రుల్లో ఇన్ పేషెంట్లు, ఔట్ పేషెంట్లు వార్డులను ఏర్పాటు చేసినట్లే ఈ బహుళార్థ పశువైద్యశాలలో కూడా పశువులను, పాడిగేదెలను ఇక్కడే ఉంచి పూర్తిస్థాయిలో వైద్యం కొన్ని రోజుల పాటు అందించేందుకు వసతులు కల్పించారు. గత ఐదేళ్ల కాలంలో ఏరోజూ పశువులను కానీ, పాడి గేదెలను గానీ ఇన్ పేషెంట్లు రీతిలో ఇక్కడ చేర్చుకుని నామమాత్రంగా తప్ప తగిన వైద్యం అందించలేదు. కేవలం ఈ ఆసుపత్రి అలంకారప్రాయంగానే మిగిలిందని తమకు ఏ మాత్రం ప్రయోజనాన్ని కల్పించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్మినెంట్ డాక్టర్లు, సిబ్బందిని ప్రభుత్వం నియమించకకుండా జిల్లాలోని డాక్టర్లు, సిబ్బందిని ఇక్కడ డిప్యుటేషన్‌పై ఏర్పాటు చేశారు.

శిథిలావస్థలో పశువుల ఆసుపత్రులు.. అద్దె భారం సిబ్బందిపైనే

గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 170కి పైగానే పశువైద్యశాలలు ఉన్నాయి. ప్రస్తుతం వీటికి మరమ్మతులు చేసేందుకు కూడా నిధులు అందించడం లేదు. ఈ భవనాలు పూర్తిగా పడిపోయే దుస్థితిలో ఉన్నాయి. వాటిలో ప్రాణభయంతో పని చేస్తున్న సిబ్బంది అద్దె భారాన్ని కూడా భరించాల్సి వస్తోంది. కనీసం కరెంటు ఖర్చులు, ఇతర మెయింటెనెన్స్ కోసం నిధులు ఇవ్వకపోవడంతో తమ జీతాల్లో సగం దాకా వీటికే ఖర్చు చేయాల్సిన పరిస్థితి దాపురించిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నాటు వైద్యమే దిక్కు

వైద్యం సరిగా అందకపోవడంతో గ్రామాల్లో పశువులకు జబ్బు చేస్తే నాటు వైద్యులే దిక్కవుతున్నారు. వర్షాకాలంలో, ఎండాకాలంలో పశువులకు వచ్చే రోగాలకు రైతులు చెట్టుపసరు, మూలికలను వాడుతున్నారు. అవి వికటిస్తే మాత్రం పశువులను కాటికి పంపాల్సి వస్తుందని రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

మూగజీవాల కోసం కేటాయించిన స్థలాలను కబ్జా చేశారు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గొర్రెలు, మేకల పెంపకందారుల కోసం గత టీడీపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను, పశుగ్రాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటన్నిటినీ వైసీపీ ప్రభుత్వం గాల్లో కలిపేసింది. దీంతో గొర్రెలు, మేకల పోషణ భారం భరించలేక వాటి యజమానులు తల్లడిల్లిపోతున్నారు. గత టీడీపీ ప్రభుత్వం గొర్రెలు, మేకలకు ఆశ్రయం కల్పించేందుకు స్థలాలను కూడా కేటాయించిది. ఈ స్థలాలను కూడా కొంత మంది స్థానిక వైసీపీ నాయకులు కబ్జా చేసేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేంద్ర ప్రభుత్వ సంస్థ (ఎన్‌సీడీసీ) ద్వారా కేటాయించిన నిధులను పక్కదారి పట్టించేశారు. కేవలం మొదటి విడతగా మాత్రమే రూ.10 కోట్లను ఖర్చు చేశారు. ఇంకా రూ.25 కోట్లు గొర్రెలు, మేకల సహకార సంఘాల సభ్యులకు అందజేయాల్సి ఉంది.

- వై. నాగేశ్వరరావు యాదవ్, గొర్రెల పెంపకందారుల ఫెడరేషన్, రాష్ట్ర చైర్మన్

వైసీపీ ప్రభుత్వంలో మూగజీవాలపై పూర్తిగా నిర్లక్ష్యం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మూగజీవాల పోషణపై లక్షలాది మంది రైతులు ఆధారపడ్డారు. ప్రస్తుతం పంటల సాగులో పశువుల ప్రాధాన్యత ఉన్నా వాటి పోషణ భారాన్ని భరించలేక రైతులు వాటిని పశువుల సంతలకు తరలిస్తున్నారు. గోవధశాలలకు విక్రయిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పశువుల ఆకలి తీర్చేందు కోసం పశుగ్రాస క్షేత్రాలు, సైలేజీ పెంపకం కోసం నిధులను పుష్కలంగా అందించేది. ఆ పథకాలన్నీంటిని గత వైసీపీ ప్రభుత్వం గాలిలో కలిపేసింది. మళ్లీ టీడీపీ అధికారంలోకి వచ్చింది కాబట్టి గత పథకాలను పునరుద్ధరించాలి.



- రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి


మున్సిపల్ శాఖ మంత్రి సమీక్ష



వీడియో కాన్ఫరెన్సులో నగర పాలక సంస్థ అధికారులు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 6 : రాష్ట్రంలోని అన్న క్యాంటీన్లను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్లకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆదేశించారు. మంగళవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ పివి. రామలింగేశ్వర్, ఎంఈలు శేషసాయి, షాకీర్ హుస్సేన్, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు. అన్న క్యాంటీన్ల ఏర్పాటు, డ్రైన్‌లలో పూడికతీత తొలగింపుపై కమిషనర్లకు మంత్రి పలు సూచనలు చేశారు. నగరంలోని పలు ప్రాంతాలలో క్యాంటీన్ భవన నిర్మాణం జరుగుతున్న తీరును కమిషనర్ మంత్రికి వివరించారు. క్యాంటీన్ భవనాల్లో కిచెన్ ఏర్పాటు చేసే టీమ్‌తో సమన్వయం చేసుకోవాలన్నారు.

అన్న క్యాంటీన్లు సిద్ధం



- 15న ప్రారంభానికి ఏర్పాట్లు
- నగర పాలక పరిధిలో 5 క్యాంటీన్లు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 6:

పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు సిద్ధమవుతున్నాయి. ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్యదినోత్సవం రోజున వీటిని ప్రారంభించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోని ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోంది. ఐదేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు పేదల ఆకలిని తీరుస్తూ అందరి మన్ననలు పొందాయి. అన్ని వర్గాల ప్రజలకు రుచికరమైన భోజనం అందిస్తూ అన్నక్యాంటీన్లు గుర్తింపు తెచ్చుకున్నాయి. అనంతరం 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడింది. పేదలకు పట్టెడన్నం లేకుండా చేస్తూ క్యాంటీన్లను మూసివేస్తూ అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. అన్నక్యాంటీన్లను మూసివేసి నిరుపేదలకు రుచికరమైన భోజనాన్ని దూరం చేశారు. ఈ నిర్ణయంపై అన్ని వర్గాల్లోనూ తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఈ నేపథ్యంలో అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తామని చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ఆ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 33 మున్సిపాలిటీల్లో ఈ నెల 15న వంద అన్నక్యాంటీన్లను ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

నగర పాలక పరిధిలో 5 క్యాంటీన్లు

నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 5 అన్నక్యాంటీన్లను సిద్ధం చేస్తున్నారు. కొండారెడ్డిబురుజు, కలెక్టరేట్, ఎస్టేట్ సెట్యూర్ కార్యాలయం, ఉల్చాల రోడ్డులోని పరిమళ నగర్‌లోని క్యాంటీన్లను ఈ నెల 15న ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉన్న క్యాంటీన్‌ను మాత్రం సెప్టెంబరులో ప్రారంభించనున్నారు. గతంలో ఈ క్యాంటీన్ల స్థానంలో సచివాలయాలు ఉండేవి. వీటిని మరోచోటుకు తరలించారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అన్నక్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టరేట్‌కు ప్రతి రోజు వందల మంది వస్తుంటారు. అదే విధంగా కొండారెడ్డిబురుజు ప్రాంతానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా ప్రజలు వస్తుంటారు. ఇక ఎస్టేట్‌లో ఎక్కువ శాతం పరిశ్రమలు ఉండటంతో అక్కడ పని చేసే కార్మికులకు కడుపు నిండా రుచికరమైన భోజనం పెట్టాలనే ఆలోచనతోనే ప్రారంభిస్తున్నారు. ఉల్చాల రోడ్డు పరిమళ నగర్ ప్రాంతంలో ఎక్కువ శాతం అన్ని వర్గాల ప్రజలు నివసిస్తున్నారు. ఇక ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వివిధ జిల్లాల నుంచి రోగులతో పాటు వారి బంధువులు వస్తుంటారు. వారి సౌలభ్యం కోసం రద్దీగా ఉన్న ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక్కో అన్న క్యాంటీన్ మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలు కేటాయించింది. క్యాంటీన్‌లో కిచెన్, ఎలక్ట్రికల్, పెయింటింగ్, ఫర్నిచర్, టైల్స్, తదితర వాటి కోసం మొత్తం 5 క్యాంటీన్లకు రూ.50 లక్షలు ఖర్చు చేశారు. ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణలో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.



ప్రారంభానికి సిద్ధమైన అన్న క్యాంటీన్

అన్ని హంగులతో అన్న క్యాంటీన్లు



నగర పాలక సంస్థ పరిధిలోని అన్న క్యాంటీన్లను అన్ని హంగులతో సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వం సూచించిన విధంగానే మరమ్మత్తులు చేయిస్తున్నాం. ఇంజనీరింగ్ అధికారులు వేగవంతంగా పనులు చేస్తున్నారు. పదో తేదీకి నాలుగు క్యాంటీన్లను ప్రభుత్వానికి అప్పగిస్తాం.

- పివి.రామలింగేశ్వర్, కమిషనర్, నగర పాలక సంస్థ

జిల్లా అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయండి

ఎస్పీ, కలెక్టర్లకు చంద్రబాబు, పవన్ సూచన

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 6: జిల్లా అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కలెక్టర్ పి. రంజిత్‌బాషా, ఎస్పీ బిందుమాధవ్‌లకు సూచించారు. విజయవాడలోని జరిగిన రాష్ట్ర స్థాయి కలెక్టర్ల సదస్సులో సీఎం, డిప్యూటీ సీఎంలు కలెక్టర్, ఎస్పీలతో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వంపై పెంచుకున్న ఆశలు నెరవేరేలా యంత్రాంగాన్ని నడపాలని వారు అన్నారు. ఒక నిబద్ధత, పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లడమే కాకుండా తమ దృష్టికి వచ్చిన సమస్యల్లో ఏది మంచో ఏదీ చెడో నిర్ధారించుకుని తగిన విధంగా స్పందించాలని పిలుపునిచ్చారు. యంత్రాంగంలో సేవాభావం పెరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు.



కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



ఉల్లి ధర పైపైకి..

- ఈ సీజన్‌లో ఇదే రికార్డు
- క్వింటా గరిష్ఠంగా రూ.3,075



కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 6: ఉల్లిగడ్డల ధర క్రమక్రమంగా ఆకాశాన్నంటుతోంది. వినియోగదారుల కళ్ల నుంచి నీళ్లు కారుతున్నాయి. రైతులు మాత్రం సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటా ఉల్లికి గరిష్ఠ ధర రూ.3,075 పలికింది. కనిష్ఠ ధర రూ.2,549 నమోదైంది. వర్షాలు ముందస్తుగా కురిసినా ఉల్లి పంట ఇంకా చేతికి అందలేదు. మే నెలలో సాగైన ఉల్లి పంటను ప్రస్తుతం కర్నూలు యార్డుకు తీసుకువస్తున్నారు. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి 100 క్వింటాళ్ల ఉల్లి కర్నూలు యార్డుకు తీసుకువచ్చారు. అదే విధంగా వాము క్వింటం ధర గరిష్ఠంగా రూ.16,381, మధ్యస్థ ధర రూ.5,200 రైతుకు దక్కింది. కందులు క్వింటా రూ.10,046, మధ్యస్థ ధర రూ.3,058, కనిష్ఠ ధర రూ.3,058 పలికింది. శనగలకు మధ్యస్థ, గరిష్ఠ ధరలు రూ.4,228, ఎండుమిర్చి రూ.5,229, కొర్రలు రూ.3,456, వేరుశనగ కాయలు రూ.7,030 రైతులకు అందినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవింద్ తెలిపారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే నేరం



సమావేశంలో మాట్లాడుతున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 6: బాల్య వివాహాలను ప్రోత్సహించినా, చేసినా బాల్యవివాహ నిరోధక చట్టం ప్రకారం నేరమని జిల్లా న్యాయా సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక టౌన్ మోడల్ పాఠశాలలో బాల్య వివాహాలు, బాల కార్మికులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. యుక్త వయస్సు వచ్చే వరకు వివాహాలు చేయరాదని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలను ఖచ్చితంగా పాఠశాలలకు పంపాలని తెలిపారు. సెప్టెంబరు 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌పై న్యాయ సేవా సదన్‌లో మున్సిపల్ అధికారులతో, పంచాయతీ రాజ్ అధికారులతో, జీవిత బీమా సంస్థ అధికారులతో న్యాయవాదుల సమీక్ష సమావేశం ఉందని అన్నారు. ఇందులో వీలైనన్ని కేసులు పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్. మనోహర్, శారద, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాఘవేంద్రస్వామి అనుగ్రహ ప్రశస్తి అవార్డులకు ఎన్నిక

మంత్రాలయం, ఆగస్టు 6: మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ సప్త రాత్రోత్సవాల్లో భాగంగా రాఘవేంద్రస్వామి అనుగ్రహ ప్రశస్తి 2024 అవార్డులకు ముగ్గురు ప్రముఖులు ఎంపికైనట్లు ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషీ తెలిపారు. బెంగుళూరు చెందిన టీజీఎస్ అండ్ ఎస్‌జేబీఐటీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా. ప్రకాష్ నాథ్ స్వామీజీ, బెంగుళూరు చెందిన పండితులు విద్వాన్ రఘుపతి ఉపాధ్యాయ, వారణాసికి చెందిన ప్రొఫెసర్ వరాజభూషణ్ వద్నాలు ఎంపికైనట్లు తెలిపారు.

వీఆర్వో మద్దిలేటిని సస్పెండ్ చేయాలి

డీఆర్వోకు డీవైఎఫ్ఐ వినతి



ఇన్‌చార్జి జేసీ, డీఆర్వోకు వినతి పత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 6: ప్రభుత్వ భూములను ఆన్‌లైన్ చేసి పాస్ పుస్తకాల ద్వారా కోట్లు సంపాదించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న కల్లూరు మండలం వీఆర్వో మద్దిలేటిని సస్పెండ్ చేయాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలోని డీవైఎఫ్ఐ నాయకులు ఇన్‌చార్జి జేసీ మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడుతూ వీకర్ సెక్షన్ కాలనీలోని 338 సర్వే. నెంబరు, డ్రైవర్స్ కాలనీలోని 79/2బీ సర్వేనంబరు, ఒక్కెర వాగు 55 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూములకు అక్రమంగా పాసుపుస్తకాలు చేయించడంలో వీఆర్వో మద్దిలేటి కీలకంగా వ్యవహరించాడన్నారు. 257/1బీ సర్వే. నెంబరులో ప్రభుత్వ భూమిని ఒక వ్యక్తికి ఆన్‌లైన్ చేయించి ఇస్తానని రూ.5 లక్షలు లంచం తీసుకున్నాడని ఆరోపించారు. ఏ. గోకులపాడులో ఎస్సీలకు దక్కాల్సిన భూమిని ఇతరులకు కేటాయించి అక్రమంగా డబ్బు సంపాదించాడన్నారు. ఇలా కల్లూరు పరిధిలో వందల సంఖ్యలో పట్టాల మార్పిడి, అవినీతికి పాల్పడిన అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అవినీతి సొమ్ముతో నిర్మిస్తున్న భవనంపై విచారణ చేపట్టాలన్నారు. వీఆర్వో మద్దిలేటి చేసిన అవినీతి అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి హుశేన్‌బాషా తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో కనకాద్రిపల్లె వాసి మృతి

కొలిమిగుండ్ల, ఆగస్టు 6: అనంతపురం జిల్లా, పెద్దవడుగూరు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లె గ్రామానికి చెందిన సూర్యనారాయణరెడ్డి(65) మృతి చెందాడు. తన సొంత ట్రాక్టర్‌లో నాపరాళ్ల లోడుతో పామిడికి డ్రైవర్‌తో పాటు సూర్యనారాయణ రెడ్డి కూడా వెళ్లాడు. అయితే పెద్దవడుగూరు దగ్గర ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో బండరాళ్ల మీదపడి సూర్యనారాయణ రెడ్డి మృతి చెందాడు. పెద్దవడుగూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యాన శాఖలో రూ.77 లక్షల బకాయిలు విడుదల

- రైతుల్లో సంతోషం
- జేడీ రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 6: ఉద్యాన శాఖలో వివిధ పథకాల కింద లబ్ధి పొందిన రైతులకు గత వైసీపీ ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందించాల్సిన మొత్తాన్ని అందించకుండా ఆ నిధులను దారి మళ్లించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 2022-23, 2023-24 సంవత్సరాల్లో పెండింగ్‌లో ఉన్న ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవై పథకాల నిధులను తెలుగుదేశం ప్రభుత్వం విడుదల చేసింది. ఉద్యానసమగ్ర అభివృద్ధి మిషన్ పథకం కింద రూ.66,89,019, అదే విధంగా రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద రూ.15,75,000, 2023-24 సంవత్సరానికి సంబంధించి రూ.77లక్షలు విడుదల చేసినట్లు ఉద్యానవన శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకుల అవస్థలు



- రెన్యువల్ ఉత్తర్వులు జారీ ఏదీ...?
- మూడు నెలల జీతాలు పెండింగ్
- ఆందోళనలో అధ్యాపకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 6: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న అధ్యాపకుల సమస్యలను గత వైసీపీ ప్రభుత్వం పరిష్కారం చూపకపోగా.. జిల్లా ఉత్తీర్ణత శాతం ఉత్తర్వులతో అంధకారంలోకి నెట్టివేసింది. ప్రతి ఏడాది అకడమిక్ ఇయర్ ప్రారంభం కాకమునుపే మే నెలలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేసే అధ్యాపకులకు యథావిధిగా కొనసాగింపు రెన్యువల్ ఉత్తర్వులు ఇంటర్మీడియట్ బోర్డు జారీ చేసేది. విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచినా ఇప్పటికీ అలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. వార్షిక పరీక్షల్లో ప్రతి సబ్జెక్టులోనూ జిల్లా ఉత్తీర్ణత శాతంతో విద్యార్థులు పాస్ కావాలనే షరతు విధించింది. ఈ నిబంధన ప్రకారం ఆ సబ్జెక్టు బోధిస్తున్న అధ్యాపకుడు కొనసాగింపునకు అర్హత సాధిస్తాడు. జిల్లా ఉత్తీర్ణత శాతం కంటే ఆ సబ్జెక్టులో తక్కువ మార్కులు వచ్చినట్లయితే రెన్యువల్‌కు అనర్హులు అవుతారు. ఇది ఈ జీవో సారాంశం.

కర్నూలు జిల్లాలోని 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెగ్యులర్, కాంట్రాక్టు, గెస్టు అధ్యాపకులు మొత్తం 356 మంది పని చేస్తున్నారు. ఇందులో కాంట్రాక్టు పద్ధతిలో మొత్తం 171 మంది అధ్యాపకులు పని చేస్తున్నారు. వీరికి గత మూడు నెలల నుంచి జీతాలు అందక ఆందోళన చెందుతున్నారు. కుటుంబాలను పోషించుకోవడానికి అధిక వడ్డీలతో అప్పులు తీర్చలేక, మరో పక్క విధులను నిర్వర్తించడం కష్టంగా మారిందని అధ్యాపకులు విచారం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల రెన్యువల్ లేక, ఇటు జీతాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్డీయే ప్రభుత్వం అయినా రెన్యువల్ చేసి పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు అందించాలని ఆశగా ఎదురు చూస్తున్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి



జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిలో పని చేసే అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి. గత ప్రభుత్వం రెగ్యులర్ చేస్తామని చెప్పింది. జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత జీవో జారీ చేశారు. అధ్యాపకుల వివరాలన్నింటినీ సేకరించారు. ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం ఓడిపోవడంతో మా సమస్య అక్కడే ఆగిపోయింది. కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకుని రెగ్యులర్ చేయాలి.

- ఎన్.బ్రహ్మేశ్వర్లు, ఏపీజీజేసీ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

పెండింగ్ జీతాలు చెల్లించాలి



కాంట్రాక్టు అధ్యాపకులకు నెలనెలా ప్రభుత్వం జీతాలు విడుదల చేయాలి. గత 3 నెలల నుంచి జీతాలు అందక అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటర్మీడియట్ బోర్డు జారీ చేసిన జిల్లా ఉత్తీర్ణత శాతం నిబంధన తొలగించాలి. ఎలాంటి షరతులు లేకుండా జీతాలు అందించాలి. ఉద్యోగుల శ్రేయస్సు దృష్ట్యా అధ్యాపకులందరినీ రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

- ఈశ్వర్, ఏపీజీజేసీ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ

రైతులకు న్యాయం చేయండి

- హంద్రీనీవా కాలువను పరిశీలించిన సీపీఎం నాయకులు
- పంటనష్టం అంచనాపై నివేదికలు : వ్యవసాయశాఖ జేడీ వరలక్ష్మి



పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ జే.డీ.వరలక్ష్మి



కోతకు గురైన పంటలను పరిశీలిస్తున్న సీపీఎం బృందం

వెల్దుర్తి, ఆగస్టు, 6: హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల కాలువకు గండి పడిన నేపథ్యంలో రెండు వందల ఎకరాలకు పైగా పంట నీట మునిగింది.. ఆ రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలో 58వ కిలోమీటరు వద్ద శెట్టిపల్లె (మల్లెపల్లె పంప్‌హౌస్) వద్ద హంద్రీ నీవా కాలువకు సోమవారం గండిపడిన విషయం తెలిసిందే. దీంతో ఆర్‌డీవో శేషిరెడ్డి, వ్యవసాయశాఖ జేడీ వరలక్ష్మి పంటలను మంగళవారం పరిశీలించారు. అదేవిధంగా సీపీఎం నాయకులు కూడా పంటలతో పాటు గండిపడిన ప్రాంతాన్ని పరిశీలించారు. కాలువ ఆయకట్టుకు ఉన్న మూడు మండలాల పరిధిలో సుమారుగా 200 ఎకరాల్లో నీరు ప్రవహించి భూములు కోతకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సందర్భంగా అధికారులు రైతులతో మాట్లాడారు. రైతులు అధైర్య పడవద్దని, నష్టం మీద నివేదికలు ప్రభుత్వానికి అందజేసి పరిహారం అందేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. వీరి వెంట ఏడీఏ సాల్‌రెడ్డి, కోడుమూరు తహసీల్దార్ వెంకటేష్ నాయక్, కోడుమూరు అగ్రికల్చర్ ఏవో రవిప్రకాష్‌గౌడు, వీఆర్‌వోలు, వీవోఏలు పాల్గొన్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి : హంద్రీనీవా కాలువ గండి పడిన ప్రాంతాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాధాకృష్ణ, రామకృష్ణ పరిశీలించారు. కాలువకు గతంలోనే రెండుసార్లు గండి పడినప్పటికీ ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదిక మీద చర్యలు తీసుకోలేదని అన్నారు. కాలువ మరమ్మత్తులు వేగంగా చేపట్టి, రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

ట్రిపుల్ ఐటీ సమస్యల పరిష్కారమే లక్ష్యం

కేంద్ర మంత్రికి ఎంపీ బస్తిపాటి వినతి పత్రం



కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(అర్బన్), ఆగస్టు 6: నగర శివారులోని ట్రిపుల్ ఐటీ కళాశాలలోని సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తానని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. మంగళవారం డిల్లీలోని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఆయన కలిసి వినతి పత్రం ద్వారా పరిష్కరించాలని కోరారు. కళాశాలలో ఖాళీగా ఉన్న 36 బోధన, బోధనేతర పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, అలాగే కళాశాలలో నీరు, రోడ్లు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, కాంపౌండ్ వాల్ నిర్మించాలని కోరారు. ట్రిపుల్ ఐటీ కళాశాల సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఎంపీ తెలిపారు.

శ్రీశైలంలో అగ్ని ప్రమాదం

కొబ్బరి చిప్పల ప్రాసెసింగ్ యూనిట్‌లో మంటలు



చెలరేగుతున్న మంటలు

శ్రీశైలం, ఆగస్టు 6: శ్రీశైలం దేవస్థానం పరిధిలో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఆలయ సమీపంలోని కొబ్బరి చిప్పల ప్రాసెసింగ్ యూనిట్ కర్మాగారంలో అగ్ని ప్రమాదం సంభవించింది. కొబ్బరి చిప్పలను ప్రాసెసింగ్ చేసే విధానంలో భాగంగా మంగళవారం సాయంకాలం నిప్పులను ఇనుప మంచాల కింద పరచి దానిపై కొబ్బరి చిప్పలను ఆరబెట్టారు. ఈ సందర్భంలో అధిక ఉష్ణోగ్రతతో కొబ్బరి చిప్పలు అంటుకుని అగ్ని ప్రమాదానికి దారి తీశాయి. దట్టమైన పొగ రావడంతో గుర్తించిన స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఫైర్ ఇంజన్‌తో పాటు దేవస్థానం వాటర్ ట్యాంకుల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దేవస్థానం సిబ్బంది నివాస గృహాల మధ్య ఈ కార్మాగారం ఉంది. స్థానికులు మంటలను అదుపులోకి తీసుకురాకపోయి ఉంటే పెద్ద ప్రమాదమే సంభవించేది. ఇది ఇలా ఉండగా ఈ కర్మాగారాన్ని శ్రీశైలం శివారులోకి ఏర్పాటు చేయాలని పలుమార్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గతంలో కూడా రెండుసార్లు ఇదే కర్మాగారంలో అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న స్థానిక సీఐ ప్రసాదరావు, ఎస్ఐ లక్ష్మణ రావు, దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.

కర్నూలు జీజీహెచ్‌కు రికార్డు స్థాయిలో ఓపీ రోగులు

- సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి



కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 6: రాయలసీమకు తలమానికమైన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ఇటీవల విస్తరించిన సేవల కారణంగా జూలై నెలలో రికార్డు స్థాయిలో ఓపీ నమోదైనట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి వెల్లడించారు. ఆసుపత్రికి గతంలో ప్రతి రోజు 2000 నుంచి 2,500 మంది ఓపీ రోగులు వచ్చేవారని, జూలై నెలలో 2,700 నుంచి 3,000 మంది వచ్చారని అన్నారు. ఏప్రిల్ నెలలో ఓపీ 60,515 మంది, అడ్మిషన్లు 5,387, పరీక్షలకు 1.17 లక్షల మంది వచ్చారన్నారు. జూలై నెలలో ఓపీ రోగులు 79,467 మంది రాగా, అడ్మిషన్లు 7,142, పరీక్షలు 2.40 లక్షల మందికి నిర్వహించినట్లు వెల్లడించారు. జూలై నెలలో అత్యవసర రోగుల కోసం కొత్తగా క్యాజువాల్టీ, ఆర్ఐసీయూ వార్డులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో ఓపీ కేంద్రాలు ఆరు ఉండగా.. వీటి సంఖ్య 12కి పెంచామన్నారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేకంగా సెంటర్లు, డిజిటల్ ఓపీ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. న్యూడయోగ్నస్టిక్ బ్లాకులో అల్ట్రాసౌండ్, ఈసీజీలతో పాటు ఇతర వ్యాధి నిర్ధారణ పరీక్షలను వేగవంతం చేశామన్నారు. ఈ ఏర్పాట్ల వల్ల కర్నూలు జీజీహెచ్‌లో కార్పొరేట్ స్థాయిలో పోటీ పడుతూ రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. వైద్యులు, సిబ్బంది, నర్సులు, పారామెడికల్ సిబ్బంది నిరంతరం సేవలందించడం వల్ల రికార్డు స్థాయిలో రోగులు చికిత్సలు పొందుతున్నారన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

హాస్టల్ భవనంపై నుంచి దూకిన బాలుడు



పరామర్శిస్తున్న బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మమ్మ



వీరేష్ (ఫైల్)

కోడుమూరు (రూరల్), ఆగస్టు 6: వసతిగృహంలో ఉంటూ చదవడం ఇష్టంలేని ఓ విద్యార్థి భవనంపై నుంచి ఆత్మహత్య చేసుకున్న ఘటన కోడుమూరు మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని అమడగుంట్ల బీసీ హాస్టల్ భవనం పైనుంచి దూకి వీరేష్(13) అనే 8వ తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. దేవనకొండ మండలంలోని పి కోటకొండకు చెందిన కమ్మరి బ్రహ్మయ్యఆచారి, రాధ దంపతులకు ఇద్దరు కుమారులు. ఆ దంపతులు కూలీపనులు చేసుకుంటూ, పూరిగుడిసెలో జీవిస్తున్నారు. పేదరికం కారణంగా కుమారులను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. ఈ మధ్యనే బ్రహ్మయ్య జబ్బుపడటంతో సుమారు రూ.4 లక్షలు వైద్యానికి అప్పులు చేశారు. పూట గడవడమే కష్టంగా ఉన్న ఆ కుటుంబంలో పిల్లల చదువుకు ఇబ్బంది కలుగకుండా హాస్టల్‌లో చేర్చాలనుకున్నారు. గత వారంలో కంబాలపాడు హాస్టల్ పిల్లలిద్దరిని జాయిన్ చేశారు. రెండు మూడు రోజుల అనంతరం పెద్దకుమారుడు వీరేష్ హాస్టల్‌లో ఉండే ఇష్టం లేదని తల్లిదండ్రులతో చెప్పాడు. దీంతో తండ్రి బహ్మయ్యఆచారి దగ్గరి బంధువుల పిల్లలు ఉన్న కోడుమూరు మండలంలోని అమడగుంట్ల హాస్టల్‌లో చేర్చాడు. అయితే హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేని పెద్దకుమారుడు వీరేష్ రెండస్తుల భవనం పైనుంచి కిందకు దూకి తీవ్రగాయాలపాలయ్యాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన వీరేష్‌ను హాస్టల్ అధికారులు, సమీపంలోనే ఉన్న తండ్రి బ్రహ్మయ్య ఆచారి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ బాలనరసింహులు ప్రమాదఘటనాస్థలాన్ని పరిశీలించారు. విషయం తెలిసిన వెంటనే జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మమ్మ ప్రభుత్వాసుపత్రి వద్ద విద్యార్థి తల్లిదండ్రులను పరామర్శించారు. జరిగిన ఘటనపై వార్డెన్, అధికారులతో ఆరా తీశారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

- వాహనం సీజ్
- డ్రైవర్ అరెస్టు
- మరో ఐదుగురిపై కేసు నమోదు



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న జిల్లా సెబ్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్

ఆలూరు, ఆగస్టు 6: కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి బోలెరో మ్యాక్స్ కేఏ 34 సీ 9504 వాహనంలో 54 టెట్రా పాకెట్స్ మద్యం బాక్స్‌లను తీసుకువస్తుండగా కురుకుంద గ్రామం సమీపంలో మంళవారం ఆలూరు సెబ్ ఇన్‌చార్జి సీఐ మల్లిక సిబ్బంది గుర్తించారు. వాహనంతో పాటు మద్యం బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సెబ్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్ మాట్లాడుతూ కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకువచ్చి హొళగుందకు చెందిన దుర్గన్న వివిధ గ్రామాలకు సప్లై చేస్తున్నాడని తెలిపారు. డ్రైవర్ సలీం బాషాను అదుపులోకి తీసుకొని విచారణ చేశామన్నారు.. ఈ కేసులో డ్రైవర్‌తో పాటు హొళగుందకు చెందిన దుర్గన్న, ముసనహళ్లికు చెందిన హరి ప్రసాద్, బోయ శేఖర్, మణేకుర్తికి చెందిన మురళి, బళ్లారికు చెందిన హనుమంతులపై కూడా కేసులు నమోదు చేశామని తెలిపారు.

లారీని ఢీకొన్న కంటైనర్

- క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్
- రెండు గంటలు నరకయాతన

చాగలమర్రి, ఆగస్టు 6: మండలంలోని పెద్దబోదనం గ్రామ సమీపంలో 40వ జాతీయ రహదారిపై నిలిచి ఉన్న లారీని వెనుకవైపుగా వస్తున్న కంటైనర్ ఢీకొట్టింది. ఈ సంఘటన మంగళవారం జరిగింది. ఆళ్లగడ్డ వైపు నుంచి చెన్నైకు వెళ్తున్న లారీ పంచర్ కావడంతో పెద్దబోదనం సమీపంలో ఆగింది. అదే మార్గంలో వెనుక వైపు నుంచి వస్తున్న కంటైనర్ నిలిచి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో కంటైనర్‌లోని డ్రైవర్ మనోహరన్ తీవ్రంగా గాయపడ్డాడు. క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయి రెండు గంటల పాటు నరకయాతన పడ్డాడు. స్థానిక టోల్‌ప్లాజా సిబ్బంది, పోలీసులు డ్రైవర్ మనోహరన్‌ను బయటకు తీశారు. గాయపడ్డ మనోహర్‌ను 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి కౌలు రైతు ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

జూపాడుబంగ్లా, ఆగస్టు 6: అప్పులబాధ తట్టుకోలేక కౌలురైతు సుబ్బరాయుడు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జూపాడుబంగ్లాలో జరిగింది. గ్రామానికి చెందిన సుబ్బరాయుడు(69) తనకున్న ఎకరా పొలంతోపాటు మరో 4 ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగుచేసేవాడు మూడేళ్ల నుంచి వర్షాలు పడక, పంటలు సరిగా రాక రూ.6 లక్షలు అప్పు అయింది. అప్పులు చెల్లించలేక మనస్తాపానికి గురై సోమవారం పొలం వద్దకు వెళ్లి పురుగులమందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు 108లో నందికొట్కూరుకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య ఓబులమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

ట్రాక్టరు బోల్తా : ఒకరు మృతి

రుద్రవరం, ఆగస్టు 6 : మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన లక్ష్మీనరసయ్య అలియాస్ గుల్లోడు (20) ట్రాక్టరు నడుపుతుండగా అదుపు తప్పి మంగళవారం రాత్రి బోల్తాపడింది. ముకుందాపురం గ్రామ సమీపంలోని ఎర్రచెరువు రస్తాలో ఈ ప్రమాదం జరిగింది. కుటుంబంలో విషాదం అలుముకుంది. పంట పొలానికి దున్నేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 6: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రభుత్వ హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలని ఏఐఎ స్ఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సీఆర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహిం చారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నా లో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న, కార్యదర్శి ఎస్.సాబీర్ బాషా మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లో కనీస సౌక ర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థుల కు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. జిల్లాలో 70 శాతం హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని అన్నారు. ఈ హాస్టళ్లన్నింటికి సొంత భవనాలు కేటాయించాలని, జీవో నెంబరు 77ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ నాయకులు డీఆర్వో మధు సూదన్‌రావును కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐ ఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు రంగస్వామి, థామస్, వీరేష్, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, నగర అధ్యక్షుడు అశోక్, ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ విరాళం



మైక్ సెట్ విరాళంగా ఇస్తున్న పూర్వ విద్యార్థులు

ఓర్వకల్లు, ఆగస్టు 6: ఓర్వకల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1992-93 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.20వేల విలువ చేసే మైక్‌సెట్‌ను పాఠశాలకు విరాళంగా ప్రధానోపాధ్యా యుడు రామచంద్రారెడ్డికి అందజేశారు. ఈసందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఇక్కడ చదివిన విద్యార్థులు పాఠశాలను గుర్తించుకుని మైక్‌సెట్ ఇవ్వడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గోపి కృష్ణ, రఫిక్, నాగభూషణం, రాముడు, సరోజమ్మ పాల్గొన్నారు.

31లోపు పంట నమోదు పూర్తి చేయండి

కల్లూరు, ఆగస్టు 6: ఈపంట నమోదును వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో ఆగస్టు 31 లోపు పూర్తిచేయాలని ఏపీఎంఐపీ ఏపీడీ ఏ.రాధాకృష్ణారెడ్డి, కల్లూరు తహసీల్దారు కె. ఆంజనేయులు ఆదేశించారు. మంగళవారం కల్లూరు తహసీల్దారు కార్యాలయంలో గ్రామ వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో కర్నూలు జిల్లాకు 15వేల సూక్ష్మ, తుంపర సేద్య పరికరాలు వచ్చాయని తెలిపారు. సూక్ష్మ సేద్య పరికరాలను 5 ఎకరాలలోపు వ్యవసాయ రైతులకు 90శాతం సబ్సిడీ, ఆపైన 70శాతం సబ్సిడీ ఇస్తామని అన్నారు. తహసీల్దారు మా ట్లాడుతూ ఈపంట నమోదు చేసేటపుడు రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది సూక్ష్మ, తుంపర సేద్య పరికరాలను నమోదు చేయాలని ఆదే శించారు. మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

శిశువు పుట్టిన మూడు గంటలకే గుండె ఆపరేషన్

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 6: కిమ్స్ హాస్పిటల్‌లో పుట్టిన శిశువుకు గుండెలో అతి పెద్ద ధమని మూసుకుపోయి ఉండటంతో వైద్యులు ఆ శిశువుకు మూడు గంటలకే హార్ట్ ఆపరేషన్ నిర్వహించి ప్రాణాన్ని కాపాడారు. తుగ్గలి మండలం జొన్నగిరికి చెందిన హరితకు మగ శిశువు పుట్టాడు. శిశువుకు పరీక్షలు చేయగా.. గుండెలోని అతిపెద్ద ధమని ముఖద్వారం సన్నబడినట్లు గుర్తించారు. దీంతో గుండె నుంచి శరీర అవయవాలకు రక్తసరఫరా లేక గుండె పనితీరు సరిగ్గా పని చేయడం లేదని గుర్తించారు. శిశువు పుట్టిన మూడు గంటలకే బెలూన్ యాంజియోప్లాస్టి చేయాలని చిన్న పిల్లల గుండె వైద్యనిపుణులు డాక్టర్ కే.మహ్మద్ ఫారూక్ తెలిపారు. చిన్న పిల్లలకు ఇలాంటి ఆపరేషన్ చేయ డం అరుదని అన్నారు. ఈ శస్త్ర చికిత్సను నియోనటాలజిస్టు డాక్టర్ భర త్ రెడ్డి, రచన, గైనకాలజిస్టు కుసుమ, కార్డియాక్ అనస్థీషియా నిపుణు రాలు జ్యోత్స్న నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కోడుమూరు (రూరల్), ఆగస్టు 6: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ జయంతి, డాక్టర్ భాస్కర్, డాక్టర్ మాదన్న అన్నారు. సంకల్పం కార్యా చరణ కార్యక్రమం కింద ఆసుపత్రి ప్రాంగణంలో మంగళవారం 100 మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసయాదవ్, సీహెచ్‌వో శాంత, సూపర్‌వైజర్ శారద పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ జిల్లా చైర్మన్‌గా సాయికుమార్

కర్నూలు(రూరల్), ఆగస్టు 6: ఆలిండియా హ్యూమన్ రైట్స్ ఆర్గనై జేషన్ ఈగల్(ఐ) జిల్లా చైర్మన్‌గా పత్తికొండకు చెందిన కటారుకొండ సాయికుమార్ నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు మంగళవా రం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రఫీ నియామక పత్రాన్ని అందజేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 13 కేసులు నమోదు

కర్నూలు, ఆగస్టు 6: నగరంలో ట్రాఫిక్ పోలీసులు మంగళవారం రాత్రి 13 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సుంకేసుల రోడ్డులోని సంజీ విని హాస్పిటల్ దగ్గర ట్రాఫిక్ సీఐ గౌతమి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 10 ద్విచక్ర వాహనదారులు, మూడు ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. వీరిని కోర్టులో హాజరు రుస్తామని సీఐ గౌతమి తెలిపారు.

నేడు గోదాదేవి జయంతి

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 6: మామిదాలపాడులోని గోదారంగ నాథల దేవస్థానం (గోదాగోకులం)లో బుధవారం గోదాదేవి అమ్మవారి జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు గోదా రంగనాథ రామానుజ కూటమి చారి టబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలు ఉదయం 6 గంటల నుంచి ఆరంభమవుతాయని, మధ్యా హ్నం 12 గంటల వరకు నిత్య ఆరాధన, తీర్థగోష్టి, అష్టోత్తర శతకల శాలతో ఆలయ ప్రదక్షిణ, అమ్మవారికి అష్టోత్తర శతకలశ తిరుమం జనం, పట్టు వస్త్రాల సమర్పణ, తోమాలసవ, వడిబియ్యం, సారె సమ ర్పణ నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు నిత్య ఆరాధన, తీర్థగోష్టి, 6 గంటలకు ఉంజల సేవ, రాత్రి 7 గంటలకు అమ్మ వారికి గజవాహన సేవ, 8.30 వేద ఆశీ ర్వాదం, 9 గంటలకు పవళింపు సేవలు ఉంటాయని వారు తెలిపారు.

కొండాపురంలో 'పొలం బడి'

సి.బెళగల్, ఆగస్టు 6: మండలంలోని కొండాపురం గ్రామంలో పొలం బడి కార్యక్రమాన్ని మంగళవారం అధికారులు నిర్వహించారు. మండల పరిధిలోని కొండాపురం, గుండ్రేవుల గ్రామాలలో రైతులు ఖరీఫ్‌లో సాగు చేస్తున్న వరి నారు వరి పంటకు వచ్చే తెగుళ్ళపై మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. రైతులు నాసిరకం వరి విత్తనం తీసుకుని నారు కట్టం మొదలు పెట్టినప్పుడు వరి నారు మొలక దశలోనే పసుపు రంగు వస్తుందని అన్నారు. దీని వల్ల పంట సరిగా రాదని అన్నారు. ఎంపీ వోలు సిద్ధు, వెంకటేశ్వర్లు, నాయక్, రైతులు ఉన్నారు.

కళామందిరానికి కృషి చేస్తా

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 6: నగరంలోని పాతబస్టాండులో పడగొ ట్టిన మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ (ఆరుబయలు కళామందిరం)కు బదులుగా నగరంలో వేరొక చోట ఓపెన్ థియేటర్ నిర్మాణానికి కృషి చేస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం నగరంలోని మౌర్యఇన్‌లో గల మంత్రి కార్యాలయంలో జిల్లా రంగస్థల కళాకా రుల సంఘం ఆధ్వర్యంలో రంగస్థల కళాకారులు ఓపెన్ ఎయిర్ థియేటర్ కోసం మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కళాకా రులు మాట్లాడుతూ దశాబ్దాల కాలం నుంచి పేద కళా కారులకు అందు బాటులో ఉంటే మున్సిపల్ ఓపెన్ థియేటర్‌ను గత ప్రభుత్వంలో కూల్చివేసి, దాని స్థానంలో పార్కును నిర్మించిందని, దానికి ప్రత్యామ్నాయంగా ఎలాం టి థియేటర్ నిర్మించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ స్పందిస్తూ ప్రభుత్వం తరపున కృషిచేసి, ఓపెన్ ఎయిర్ థియేట ర్‌ను నిర్మిస్తామని కళాకారులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీజీవీ కళా క్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కళాకారుల సంఘం అధ్యక్షుడు గుర్రప్ప శాల అంకయ్య, సీనియర్ కళాకారులు వీవీ రమణారెడ్డి, పి. దస్తగిరి, ఎం. మనోహర్‌బాబు, కృష్ణ, సుబ్బయ్య, బీవీ ప్రకాశ్, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.



మంత్రి టీజీ భరత్‌కు వినతి పత్రం ఇస్తున్న న్యాయవాదులు

'కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సహకరించండి'

కర్నూలు(లీగల్): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసి న్యాయవాదుల దీర్ఘకాలిక కోరికను సాకారం చేయాలని కర్నూలు బార్ అసోసియేషన్ న్యాయవాదులు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం న్యాయవాదులు టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు దాసెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంత్రిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. స్థానికంగా 3వేల మంది న్యాయవాదులు ఉన్నారని, అయితే.. కోర్టులలో వారికి సరైన సరిపడ వసతులు లేకపోవడంతో ఇబ్బం దులు పడుతున్నారని, నూతన బార్ అసోసియేషన్ కార్యాలయాన్ని వెంటనే నిర్మించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవి గువేరా, న్యాయవాదులు విక్రమ్ సింగ్, కె.మోహన్‌బాబు, అస్లాంబాషా, వెంకట్రావు, గణేష్‌సింగ్ తదితరులు ఉన్నారు.

'వీరశైవ లింగాయత్‌ల సమస్యలు పరిష్కరించాలి'

కర్నూలు(ఎడ్యుకేషన్): రాష్ట్రంలోని వీరశైవ లింగాయత్, లింగబలిజ సామాజిక వర్గాన్ని కేంద్ర ప్రభుత్వం ఓబీసీలో చేర్చుటకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని వీరశైవ లింగాయత్, లింగబలిజ సంఘం నాయకులు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను కలిసి మంగళవారం వినతి పత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న 27 శాతం రిజర్వేషన్లు తమకు అందడం లేదన్నారు. మంత్రికి వినతి పత్రం సమర్పించిన వారిలో బీజేపీ ఓబీసీ మోర్చా స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ చామకూర వీరప్ప, వీరశైవ లింగాయత్‌ల అధ్యక్షుడు జాయ్ శివకుమార్, వీరభద్రప్ప, విజయకుమార్, లింగప్ప, బద్రి, రాము, పవన్, సోమేశ్, రాంబాబు పాల్గొన్నారు.



మంత్రి టీజీ భరత్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రంగస్థల కళాకారులు

'ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి'

కర్నూలు(స్పోర్ట్స్): గాయత్రీ ఎస్టేట్‌లో ప్రజలు ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేయాలని మంగళవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను తన క్యాంపు కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ సురేంద్ర కలిసి వినతి పత్రం అంద జేశారు. సురేంద్ర మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యతో విద్యార్థులు, ఎమ ర్జెన్సీ సేవలకు కాస్త అంతరాయం కలుగుతుందని ఆయన టీజీ భరత్‌కు విన్నవించారు.

కల్లూరు అర్బన్ శివారు ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట

›› 20వ వార్డు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, ఆగస్టు 6: కల్లూరు అర్బన్ 16 వార్డుల్లోని శివారు ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేయనున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత తెలిపారు. మంగళవారం 20వ వార్డు ధనలక్ష్మీ నగర్‌లో రూ.70 లక్షలతో చేపట్టనున్న సీసీ డ్రైనేజీల నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ 16 వార్డుల పరిధిలోని శివారుకాలనీల్లో అభివృద్ధికి దూరంగా ఉన్నాయని, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. అంతకు ముందు కాలనీలో సమస్యను ప్రజలు ఎమ్మెల్యే గౌరుచరితకు విన తిపత్రాలు అందజేశారు. వైసీపీ పాలనలో నాయకులు సమస్యలను పట్టిం చుకోలేదని అధికారులకు ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా స్పందించలేదన్నారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ 16 వార్డుల అధ్యక్షుడు పెరుగు పురు షోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, 20వ వార్డు ఇన్‌చార్జ్ పల్లె రఘునాథరెడ్డి, కార్పొరేటర్ నాగలక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

● **తాగునీటి సరఫరా సమయం పెంచండి:** కల్లూరు అర్బన్ 16 వార్డులలో కార్పొరేషన్ అందించే తాగునీటి సరఫరా సమయం పెంచాలని అధికారులకు గౌరుచరిత సూచించారు. ప్రజల సమస్యలపై కార్పొరేషన్ ఎం ఈ, డీఈలతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయా వార్డుల పరిధిలోని కాలనీల్లో డ్రైనేజీలు, రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి అంశాలపై సానుకూలంగా పనిచేయాలని కోరారు.



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

● **పనిచేయక పోతే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టండి:** నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు టెండర్లు వేసి పనిచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఇంజనీర్లకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. 37వ వార్డులో 5 పనులకు టెండర్లు వేసిన కాంట్రాక్టర్ ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టరుతో ఇంజనీర్లు ప్రత్యేకంగా మాట్లాడి పనులు ప్రారం భించేలా ఆదేశించాలని, లేనిపక్షంలో వారిని బ్లాక్ లిస్ట్‌లో పెడ్డడానికి వెనకా డమని అన్నారు.

సోనూసూద్ ఔదార్యం

›› సౌదీలో మృతి చెందిన కర్నూలు వాసి
›› మృతదేహాన్ని తరలించేందుకు చర్యలు

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి: సినీ నటుడు, సామాజిక కార్యకర్త సోనూసూద్ మరోమారి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. సౌదీ అరేబియాలో వారం రోజుల క్రితం కర్నూలు నగరంలోని కొత్తపేటకు చెందిన జే.రామాంజనేయులు(54) గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో ఆయన మృతదేహాన్ని కర్నూలుకు తరలించేందుకు సోనూసూద్ తనవంతు ప్రయ త్నాలు చేస్తున్నారు. సామాజిక కార్యకర్త గిరీష్ పంత్‌తో పాటు ఎంబసీ అధికారులతో ఆయన చర్చలు జరిపి సొంతఖర్చులతో మృతదేహాన్ని తరలిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా కొత్తపేటకు చెందిన రామాంజనేయులు చాలా సంవత్సరాలుగా సౌదీ అరేబియాలోని ఓ సిమెంట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. వారం రోజుల క్రితం సాయంత్రం వాకింగ్ చేస్తుండగా ఆయన గుండెపోటుతో మృతి చెందాడు.

మాలలకు అన్యాయం చేస్తే ప్రభుత్వాలను కూలుస్తాం

జేఏసీ చైర్మన్ యాట ఓబులేసు



ధర్నా చేస్తున్న మాల సంఘాల నాయకులు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 6: మాలలకు అన్యాయం చేస్తే ప్రభుత్వా లను కూలుస్తామని జేఏసీ చైర్మన్ యాట ఓబులేసు హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మంగళవారం నగరంలో మాలమహానాడు అధ్వ ర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ వర్గీకరణతో మాల కులస్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. పార్లమెంటు తీర్మా నం లేకుండ, రాజ్యాంగలోని ఆర్టికల్ 341 ప్రకారం పార్లమెంటు, రాష్ట్రపతి మోదం లేకుండా ఎస్సీ వర్గీకరణ ఎలా అమలు చేస్తారని ఆయన ప్రశ్నిం చారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమౌళిజ్యోతి, మునయ్య, మాధవ స్వామి, మాదాసు నాగరాజు, వెంకటేష్, రాజీవి, సామేల్, నవీన్ పాల్గొన్నారు.

కోతకు గురైన పొలాల పరిశీలన

కోడుమూరు(రూరల్), ఆగస్టు 6: హంద్రీనీవా సుజల స్రవంతి కెనా ల్‌కు మల్లేపల్లి వద్ద గండిపడిన ఘటనలో లద్దగిరి పొలిమేర పరిధిలో పలువురు రైతులకు చెందిన పొలాలు కోతకు గురై పంటలు కొట్టుకు పోయాయి. దీంతో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి పంట పొలాలను పరిశీలించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మంగళ వారం జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, ఆర్డీవో శేషిరెడ్డి, ఏడీఏ సాలురెడ్డి సంద ర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 250 ఎకరాల్లో పత్తి, పొద్దుతిరుగుడు, ఉల్లి వంటి పంటలు పూర్తిగా కొట్టుకు పోయాయని వాపోయారు. అధికారులు మాట్లాడుతూ నష్టం అంచనా వేయించి ప్రభుత్వా సాయానికి నివేదిక పంపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీ ల్దార్ వెంకటేష్‌నాయక్, ఏవో రవిప్ర కాష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధి కృషి చేయండి: ఎమ్మెల్యే

సి.బెళగల్, ఆగస్టు 6: సి.బెళగల్ సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. మంగళ వారం సి.బెళగల్ సొసైటీ డీసీవో రామాంజినేయులు, ప్రత్యేక అధికారి ఎం.జయాకర్, సెక్రటరీ రవికుమార్‌రెడ్డి కోడమూరు ఎమ్మెల్యే దస్తగిరిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మా ట్లాడుతూ రైతులకు సకా లంలో రుణాలు మంజూరు చేసి వారిని ఆదుకోవాలన్నారు.



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సొసైటీ అధికారులు

నీట మునిగిన పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే

కర్నూలు(రూరల్), ఆగస్టు 6: కర్నూలు అర్బన్ మండలం పరిధిలో ఉన్న మునగాలపాడు శివారులో స్థానిక టీడీపీ నాయకుడు ఎం. మణిబాబు ఆధ్వర్యంలో మంగళవారం నీటి మునిగిన పంట పొలాలను కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి కలిసి పరిశీ లించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కౌంపౌండ్ నిర్మించడం వలన కేసీ కెనాల్ ద్వారా ప్రవహించే నీరు లీకేజీ కావడంతో పక్కనే ఉన్న పొలాల్లోకి చేరి పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనుమతి లేకుండా వెంచర్‌లు వేసి అడ్డ దిడ్డంగా అక్రమ కట్టడాలు కట్టడంతోనే నీళ్లు పంట పొలాల్లోకి చేరుతున్నా యని రైతులు విష్ణువర్ధన్‌రెడ్డి, దస్తగిరి ఎదుట వాపోయారు. ఆయన అధి కారులతో మాట్లాడి న్యాయం చేస్తామని తెలిపారు.

తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు

గూడూరు, ఆగస్టు 6: గూడూరు మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రామాంజనేయులును మండల టీడీపీ నాయ కులు మంగళవారం కలిసి అభినందించారు. మునగాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కుంటిచేతి గోపాల్, రామచంద్రుడులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆర్. కానాపురం గ్రామానికి చెందిన మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్‌బాబు, సర్పంచ్ ము నుస్వామి, టీడీపీ నాయకులు మన్యం కొండ కలిసి అభినందించారు. అలాగే గూడూరు పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు కోఆప్షన్ సభ్యులు పుట్ట పాశం రామాంజనేయులు తహసీల్దార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

భాషాపండితుల రివర్స్ కేసును రద్దు చేయాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 6: మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో పని చేస్తున్న భాషాపండితుల రివర్స్ కేసును రద్దు చేసి స్కూల్ అసి స్టెంట్లుగా తెలుగు, హిందీ, ఉర్దూ వారిని యథాస్థితిలో కొనసాగించా లని రాష్ట్రహైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, దీనిని అమలు పరచాలని ఏడీఏ శామేల్ పాల్‌ను కలిసి నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.కృష్ణ, నాగరాజు మంగళశారం విజ్ఞప్తి చేశారు. ఏడీఏకి వినతి పత్రం సమ ర్పించిన వారిలో ఎన్‌టీఏ వైస్ ప్రెసిడెంటు సురేష్‌గౌడు, జాయింట్ సెక్రటరీ మల్లికార్జున, గంగాధర్, కోశాధికారి ఎం.కిరణ్ ఉన్నారు.

విద్యార్థి బస్సును సక్రమంగా నడపాలి

గూడూరు, ఆగస్టు 6: విద్యార్థి బస్సును సక్రమంగా నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్ కోరారు. మంగళవారం సా యిఉదయ్ గూడూరు మం డల నాయకుడు ఖాజావ లితో కలిసి కర్నూలు ఆర్టీసీ డిపో-2 అసిస్టెంట్ మేనేజ ర్‌కు వినతిపత్రం సమర్పిం చారు. సాయి ఉదయ్ మాట్లా డుతూ గ్రామాల నుంచి విద్యార్థులు గూడూ రులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చదువుకునేందుకు వస్తున్నారని, ప్రభుత్వ జూనియర్ కళాశాల దగ్గర రిక్వెస్టు బస్టాప్ లేకపోవడతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, తక్షణమే రిక్వెస్టు బస్టాప్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.



కర్నూలు ఆర్టీసీ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

'పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి'

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 6: కార్మికుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షు రాలు మీసాల సుమలత కోరారు. మంగళవారం నగరంలోని కార్మికశాఖ ఉప కమిషనర్ కె.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ కార్మికుల పిల్లల పెళ్లిళ్లకు పదో తరగతి అర్హత తొలగించాలని, పెండింగ్‌లో ఉన్న ప్రసూతి బిల్లులను తక్షణమే విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారులు రాంప్రసాద్, కేశన్న, శేషాద్రి, ఐక్యవేదిక నాయకులు రాము డు, ఆంజనేయులు, నాగన్న, ఖాదర్ భాయ్, శేషమ్మ పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

కర్నూలు(అర్బన్), ఆగస్టు 6: కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జేకేసీ ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వీవీ ఎస్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఐసీఐసీ బ్యాంకు, రిలేషన్షిప్ మ్యానేజర్ అనే పోస్టు కోసం ఇంటర్వ్యూలు నిర్వహి స్తారన్నారు. డిగ్రీ పూర్తి చేసి 26 సంవత్సరాలలు ఉండి, పదో తరగతి నుంచి డిగ్రీ వరకు ఎటువంటి గ్యాప్ లేకుండా కనీసం 50 శాతం మార్కులు కలిగి ఉండాన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, పాస్ పోర్టు సైజు ఫొటో, ఆధార్, మార్కుల లిస్టు జిరాక్స్‌లతో హాజరు కావాలని సూచించారు.

మహాసభను జయప్రదం చేయండి

ఓర్వకల్లు, ఆగస్టు 6: ఓర్వకల్లులో గురువారం జరిగే సీపీఐ మం డల 4వ మహాసభను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్య దర్శి సుధాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఓర్వకల్లులో విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ సీపీఐ మహాసభకు రైతులు, కార్మికులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మండల సహాయ కార్యదర్శులు మహబూబ్‌బాషా, వలి పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై ఉపాధ్యాయుల హర్షం

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 6: ప్రభుత్వ పాఠశాలల్లోని టాయ్ లెట్లలో ఉపాధ్యాయులు ఫొటోలు తీసి అప్‌లోడు చేయడం వంటి పనులను రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ రద్దు చేయడం పట్ల ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గణపతిరావు, ప్రకాష్‌రావు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలల విద్యాశాఖలో విద్యారంగ సమస్యలపై తమ దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ప్రిన్సిపల్ సెక్రటరీ పాఠశాలల విద్యాశాఖ కమిషనర్ ఈ ఫొటోలు తీసే పనిని రద్దు చేస్తూ ఆదేశించడం హర్షణీయమన్నారు. అలాగే జీవో.117ను కూడా రద్దు చేయాలని కోరారు.

తల్లిపాలలో పోషకాలు పుష్కలం



బుధవారపేట స్కూల్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 6: తల్లి పాలతో పిల్లలకు పోషకాలు పుష్కలంగా లభిస్తాయని కర్నూలు మెడికల్ కాలేజీ సామాజిక వైద్య విభా గం అధిపతి డాక్టర్ సుధాకుమారి అన్నారు. మంగళవారం నగరం లోని బుధవారపేట అంగన్‌వాడీ సెంటరులో తల్లి పాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం బుధవారపేటలో తల్లిపాల ప్రాధా న్యతపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ సింథియా శుభప్రద, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ అరుణ, రేణుక, అసిస్టెంట్ ప్రొఫె సర్లు, వైద్యులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 6: జాతీయ మానసిక ఆరోగ్య దినోత్స వాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాల యంలో డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్ అవగాహన ర్యాలీని ప్రారంభిం చారు. అనంతరం గార్గేయపురంలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమాన్ని డీఎం హెచ్‌వో తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే కార్యక్రమ అధికారి హేమలత, సైక్రియాట్రిస్టు డాక్టర్ చైతన్య, వైద్యాధికారి బి.జయలక్ష్మి, ఎంపీహెచ్ఈవో వెంకటరమణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 6: నగరంలోని బాలసాయి సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో మారమునగాల గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బాలసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజర్ రామారావు సహకారంతో, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ నిర్వహణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ జయప్రకాశ్, చెవి, ముక్కు, గొంతు వ్యాధుల వైద్య నిపుణుడు డాక్టర్ బాల ఈశ్వర్‌లు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతి నిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఆర్ఎంపీ వైద్యులు మద్దయ్య, శివారెడ్డి పాల్గొన్నారు.

అసోసియేట్ అధ్యక్షుడికి సన్మానం

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 6: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఎంప్లాయీస్ యూనియన్ జడ్పీ యూనిట్ అసోసియేట్ అధ్యక్షుడు జీవీ క్రిష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు. మంగళవారం జిల్లా పరి షత్ ఆవర ణలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో పీఐయూ ఎగ్జిక్యూటివ్ ఇం జనీర్ పి.రామ క్రిష్ణారెడ్డి, పీఆర్ఐ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్‌సీ ఈ.మద్దన్న, డీఏఓ మధుసూ దన్‌లు క్రిష్ణారెడ్డిని సత్కరించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన ఆయనను మర్యాదపూ ర్వకంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఈలు శిల్పాశ్రీ, రమేష్‌రెడ్డి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పండ్లతోటల పరిశీలన

సి.బెళగల్, ఆగస్టు 6: మండలంలోని కొండాపురం, గుండ్రేవుల గ్రామాల్లో రైతులు సాగు చేసిన పండ్ల తోటలను మంగళవారం ఎంపీ డీవో శకుంతల పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పండ్ల తోటల సాగుతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. ఎంపీడీవో వెంట ఏపీవో లక్ష్మన్న, ఈసీ పృధ్వీరాజు ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి: కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 6: నగరంలోని దుకాణదారులు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సూచించారు. మంగళవారం నగరంలో ప్రభుత్వ ఆసుపత్రి, జేఎస్ఆర్‌నగర్, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాలలో ఆయన పర్యటిం చారు. అక్కడ జరుగుతున్న పారిశుధ్య, పూడికతీత పనులను తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కొందరు దుకాణదారుల పరి సరాల ప్రాంతాలను అపరిశుభ్రంగా ఉంచుకోవడం గమనించిన కమి షనర్ వారిపై అసహనం వ్యక్తం చేశారు. పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే దుకాణాన్ని సీజ్ చేయడంతోపాటు జరిమానా విధి స్తామని హెచ్చరించారు. కమిషనర్ వెంట శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, ఇన్స్‌పెక్టర్లు రమేష్‌బాబు, అనిల్ ఉన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయండి: నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌క్యాప్) పథకానికి సం బంధించిన ప్రతిపాదనలు త్వరగా సిద్ధం చేయా లని అధికారులకు కమిషనర్ రామలింగేశ్వర్ ఆదేశించారు. మంగళవారం నగర పాలక నూతన కౌన్సిల్ హాలులో ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, ఆరోగ్య హార్టికల్చర్ విభాగాల అధికారులతో ఎన్ క్యాప్ కార్యక్రమంపై సమీక్షించారు. నగరానికి ఎన్ క్యాప్ ప్రోగ్రాం కింద రూ.7.50 కోట్లు మంజూ రయ్యాయని తెలిపారు. ఆరోగ్య అధికారి విశ్వేశ్వర రెడ్డి, ఎంఈ షాకీర్ డీసీపీ సంధ్య, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, సెక్రటరీ నాగరాజు పాల్గొన్నారు.



పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి


కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గోనెగండ్ల, ఆగస్టు 6: జిల్లా వ్యాప్తంగా వసతి గృహాలలో ఉన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు పవన్, తేజా, రంగస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో ఆ సంఘం నాయకులతో సమవేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యావిధానం పేరుతో పేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అన్ని జూనియర్ కళాశాలలో మధ్యాహ్నభోజనం పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఈ నెల 12,13 తేదీలలో ఎమ్మిగనూరులో ప్లీనరీ సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశాలకు నాయకులు, సభ్యులు హాజరుకావాలని కోరారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కర్యాక్రమంలో రియాజ్, నరేంద్ర, అరవింద్, ఓంకార్ పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి మహిళ మృతి

పెద్దకడుబూరు, ఆగస్టు 6: గ్యాస్ సిలిండర్ పేలి పెద్దకడుబూరు టీడీపీ మాజీ ఎంపీపీ హనుమంతరెడ్డి సతీమణి ఈరమ్మ (65) మంగళవారం మృతి చెందింది. ఇంట్లో గ్యాస్‌పై పప్పు వేడి చేసేందుకు వెళ్లి స్టవ్ వెలిగించే సమయంలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈరమ్మ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

టీడీపీతోనే పేదల అభివృద్ధి

తుగ్గలి, ఆగస్టు 6: టీడీపీతోనే పేదలు, బడుగు బలహీనవర్గాలు అభివృద్ధి చెందుతారనీ టీడీపీ నాయకులు మసాల శ్రీనివాసులు, రాంపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పెండేకల్ ఆర్ఎస్‌లో వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు పేదల కోసం సంక్షేమ పథకాలు అందించడంతో పాటు గ్రామాల అభివృద్ధి కోసం నిధులు కూడా మంజూరు చేస్తారన్నారు.

శ్రీమఠంలో సంస్థాన పూజలు


పూజలందుకుంటున్న మంచాలమ్మ

మంత్రాలయం, ఆగస్టు 6: మఠంలో మూలరాములు, జయరాములు, దిగ్విజయ రాములకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు కనకాభిషేకం చేశారు. మంగళవారం పూర్ణబోధ పూజా మందిరంలో సంస్థాన పూజ నిర్వహించారు. దేవతామూర్తులకు తులసి అర్చన, క్షీరాభిషేకం నిర్వహించారు. సంస్థాన పూజలను కనులారా తిలకించిన భక్తులు మంత్రముగ్ధులయ్యారు. ప్రహ్లాద రాయలను వివిధ రథాలపై ఊరేగించి ఊంజల సేవ చేశారు.

● రాఘవేంద్రస్వామి సన్నిధానంలో వెలసిన గ్రామ దేవత మంచాలమ్మకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సుగంధ ద్రవ్య అభిషేకం నిర్వహించారు. శ్రావణ మాసం తొలి మంగళవారం కావడంతో మంచాలమ్మ దేవతకు ఉదయం నుంచి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం చేసి సుగంధ్ర ద్రవ్యాలతో అభిషేకించారు.

దళిత కాలనీకి తాగునీరు అందించండి

మంత్రాలయం, ఆగస్టు 6: మండలంలోని కల్లుదేవకుంట దళిత కాలనీలో తాగునీరు అందించాలని కాలనీవాసులు రూతమ్మ, సురేంద్ర, భీమేష్, సుధాకర్, సుశీలమ్మ, అభిషేక్ కోరారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఈవోఆర్డీ ప్రభావతిదేవిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో సక్రమంగా నీటి సరఫరా రావడం లేదన్నారు. అధికారులు స్పందించి కాలనీకి తాగునీటి సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ కాలనీవాసులు మాణిక్యమ్మ, చిట్టెమ్మ, చిన్న నరసన్న, జగదీష్, రత్నమ్మ, ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


మంత్రాలయం తహసీల్దార్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

మంత్రాలయం, ఆగస్టు 6: మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి అందరికీ న్యాయం చేయాలని టీడీపీ మైనార్టీ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా అన్నారు. మంగళవారం మంత్రాలయం తహసీల్దార్ రవిని కలిసి శాలువ, పూలమాలతో సన్మానించారు. అనంతరం తహసీల్దార్‌తో మాట్లాడుతూ మంత్రాలయం మండలంలో భూ సమస్యలతో రైతులు, గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గతంలో పాలకులు పట్టించుకోలేదని, ఇప్పటికైనా చర్యలు తీసుకుని అందరికీ న్యాయం జరిగేటట్లు చూడాలని కోరారు. కార్యాలయం చుట్టూ రైతులను తిప్పించుకోకుండా గౌరవంగా పలు సూచనలు చేసి వారికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దస్తగిరి, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఏపీవీబీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నాగరాజు ఎన్నిక

మంత్రాలయం, ఆగస్టు 6: మంత్రాలయం మండలంలోని సుంకేశ్వరి గ్రామానికి చెందిన టీచర్ బోయ నాగరాజు ఏపీ వాల్మీకి బోయ సంఘం (ఏపీవీబీఎస్) ప్రొఫెషనల్ వింగ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో బోయలకు న్యాయం జరిగేటట్లు పోరాటం చేస్తామన్నారు.

బాలికల స్కూల్ దగ్గర ఆకతాయిల ఆగడాలు


హోం మంత్రితో శ్రీలక్ష్మి

ఆదోని, ఆగస్టు 6: బాలికల స్కూల్ దగ్గర ఆకతాయిల ఆగడాలు నుండి విద్యార్థులను రక్షించాలని ఆదోని మహిళా మండలి అధ్యక్షురాలు శ్రీలక్ష్మి హోం మంత్రి వంగలపూడి అనితను కోరారు. మంగళవారం హోం మినిస్టర్ వంగలపూడి అనితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదోని డివిజన్ పరిధిలోని ముద్దటమాగి గ్రామంలో మొహరం పండుగలో ఘర్షణలో దళితులపై కేసులు నమోదు చేయడం దారుణమని విన్నవించారు. స్పందించిన హోం మంత్రి త్వరలోనే ఆదోని డివిజన్ ప్రాంతాన్ని సందర్శిస్తానని, చెప్పిన సమస్యలు అన్నింటిపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు.

శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పదవిని వీరశైవ లింగాయత్‌కు కేటాయించాలి

ఆలూరు రూరల్, ఆగస్టు 6: శ్రీశైల దేవస్థానం చైర్మన్ పదవిని వీరశైవ లింగాయత్‌లకు కేటాయించాలని వీరశైవ లింగాయత్ తాలూకా అధ్యక్షుడు రామదుర్గం కుమార్ గౌడ్, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ భీమన్న గౌడ్, హొళగుంద మాజీ వైస్ ఎంపీపీ నెరణికి మల్లి గౌడ్ అన్నారు. మంగళవారం ఆలూరులో వారు మాట్లాడుతూ వీరశైవ లింగాయత్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో వీరశైవ లింగాయత్ నాయకులు మల్లికార్జున గౌడ్, నాగన్న గౌడ్, శివ పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

తుగ్గలి, ఆగస్టు 6: మండలంలో రెండు ఇళ్లలో ఎవరూ లేని సమయంలో దొంగలు చోరీ చేసి బంగారం, నగదును అపహరించారు. సోమవారం మండల పరిధిలోని బాటతాండలో బతుకుతెరువు కోసం వెళ్లిన స్వామి నాయక్, అంజీ నాయక్ ఇళ్లల్లో 3 తులాల బంగారు, రూ.లక్ష నగదును దొంగలు దొంగతనం చేశారని జొన్నగిరి ఎస్ఐ చంద్రకు మంగళవారం ఊరికి వచ్చి బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో జొన్నగిరి ఎస్ఐ చంద్ర డాగ్ స్క్వాడ్ బృందంతో తనిఖీలు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, దొంగలను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

ప్రశాంతంగా లేరు..!

● ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్‌కు పదవీ గండం..!
● రాజీనామా చేయాలని వైసీపీ కౌన్సిలర్ల డిమాండ్
● ససేమిరా అంటున్న చైర్ పర్సన్ శాంత


ఆదోని మున్సిపల్ కార్యాలయం

ఆదోని టౌన్, ఆగస్టు 6: జిల్లాలోనే అతిపెద్ద మున్సిపాలిటీగా పేరొందిన ఆదోని పురపాలకలో రాజకీయ పునాదులు కదులుతున్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్‌కు పదవీగండం తప్పేలా లేదు. వైసీపీ కౌన్సిలర్లే మున్సిపల్ చైర్ పర్సన్ శాంతను పదవి చైర్మన్ పీఠం నుంచి దింపే ప్రయత్నాలను వేగవంతం చేశారు. మునిసిపల్ కౌన్సిల్ చైర్ పర్సన్ బోయ శాంతను పదవి నుంచి తప్పించేందుకు వైసీపీకు చెందిన కౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో గత వారంలో జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి వైసీపీ కౌన్సిలర్లు చాలామంది మూకుమ్మడిగా గైర్హాజరయ్యారు. చైర్‌పర్సన్ బోయ శాంతను పదవి నుంచి దించి ఆమె స్థానంలో 42వ వార్డుకు చెందిన కౌన్సిలర్ లోకేశ్వరిని చైర్ పర్సన్‌గా చేసేందుకు పావులు కదుపుతున్నారు. ఇదే సమయంలో తాను రాజీనామా చేసే ప్రసక్తే లేదని చైర్ పర్సన్ శాంత భీష్మించారు. దీంతో వైసీపీ కౌన్సిలర్ల వ్యూహం బెడిసికొట్టినట్లయింది. అయినప్పటికీ వైసీపీ కౌన్సిలర్లు వేర్వేరు మార్గాల ద్వారా చైర్‌పర్సన్‌తో రాజీనామా చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆదోని మున్సిపల్ కౌన్సిల్‌లో 41 మంది వైసీపీ సభ్యులు ఉండగా కేవలం ఒకే ఒక కౌన్సిలర్ టీడీపీ తరపున ఉన్నారు. కౌన్సిల్ ఎన్నికలలో వైసీపీ అభ్యర్థులే ఎక్కువ మంది విజయం సాధించారు. గతంలో చైర్ పర్సన్ ఎంపిక సమయంలో సీటు కోసం కొందరు కోట్లలో ఖర్చు చేయడానికి పోటీ పడుతున్న విషయం వైసీపీ అధిష్ఠానం దృష్టికి వెళ్లడంతో బోయ శాంతను చైర్‌పర్సన్‌గా నియమిస్తూ పార్టీ హైకమాండ్ నిర్ణయం తీసుకుంది. పార్టీ ఆదేశాలు కావడంతో చేసేదేమీ లేక బోయ శాంతను మున్సిపల్ చైర్మన్‌గా అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఎంపికచేశారు. కౌన్సిల్ ఏర్పడి మూడేళ్లు కావడంతో మిగిలిన కాలానికి 42వ వార్డు కౌన్సిలర్ లోకేశ్వరిను చైర్ పర్సన్‌గా అవకాశం ఇవ్వాలన్న ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో దాదాపు 30 మంది కౌన్సిలర్లతో రాయబేరాలు సాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. నాలుగేళ్ల పదవీకాలం ముగిసే వరకు అవిశ్వాస తీర్మానం పెట్టడానికి అవకాశం లేదు. కాబట్టి చైర్ పర్సన్ శాంతతో రాజీనామా కోసం విశ్వప్రయత్నాలు జరుగుతున్నాయి. అంతవరకు కౌన్సిల్ సమావేశాలు సక్రమంగా కొనసాగుతాయా? అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం లభిస్తుందా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

4,800 ఎకరాలకు సాగునీరు అందిస్తాం: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర్‌రెడ్డి

నందవరం, ఆగస్టు 6: నియోజకవర్గ వ్యాప్తంగా 4,800 ఎకరాలకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సోగనూరు ఎత్తిపోతల పథకం కింద ఫేస్-1, ఫేస్2ల కింద రైతులకు పంప్‌హౌస్ ద్వారా శనివారం మోటర్లను ఆన్ చేసి సాగునీరును విడుదల చేశారు. దీంతో నందవరం, కనకవీడు, సూగురు, గార్లదిన్నె, ధైవందిన్నె గ్రామాల కింద రైతులకు నీరు అందుతుందన్నారు. పక్కనే ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లో దొంగలు కాపర్‌ను దొంగలించారని రైతులు తెలపగా దొంగలించి ప్రదేశాన్ని పరిశీలించి, అధికారులపై మండిపడ్డారు. వెంటనే తనకు రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. తన తండ్రి బీవీ మోహన్‌రెడ్డి ఈ ఎత్తిపోతల పథాల ద్వారా ప్రతి రైతునీరందించాలని ఆయన ఉద్దేశమని, అందుకే తాను ఎమ్మెల్యే అయ్యాక ఇక్కడ ప్రజలకు తాగు, సాగు నీరందించాలనే లక్ష్యంతో ఉన్నానన్నారు. వైసీపీ నాయకులు దోచుకునాన్నరే తప్ప ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ప్రత్యేకంగా చిలకలడోన ఎత్తిపోతల పథకానికి రూ.2 కోట్లు మంజూరు చేయాలని కలెక్టర్‌పై ఒత్తిడి తెచ్చానన్నారు. సీఎం చంద్రబాబుతో మాట్లాడి రూ.6 కోట్లు తెచ్చి ఎత్తిపోతలకు, వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తానన్నారు. ఆర్డీఎస్ ఏర్పాటుకు 2 వేల కోట్లతో ప్రతిపాదనలు పంపి దీంతో ఎత్తిపోతల పథకాల ద్వారా, గాజులదిన్నె ప్రాజెక్టుకు తాగు, సాగు నీరందించాలని చూస్తే దాన్ని వైసీపీ నాయకులు రూ.80 లక్షలు మింగేసి మధ్యలోనే నిలిపివేశారని విమర్శించారు.

● చిన్నకొత్తిలి గ్రామంలో యూపీ స్కూల్ 5వ తరగతిని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. వారితో మాట్లాడుతూ సమయానికి భోజనం అందిస్తున్నారా అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

ఎమ్మిగనూరు రూరల్: టీడీపీ కార్యకర్తలకు తాను ఎల్లవేళలా అండగా ఉంటామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం కె.తిమ్మాపురం గ్రామంలో పక్షవాతంతో బాధపడుతున్న గోవిందుతో పాటు అప్పుల బాధతో మృతి చెందిన బీజీ రంగన్నల కుటుంబాలను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షులు పార్లపల్లి మల్లికార్జున, కర్నూలు పార్లమెంట్ కురువ సాధికార సంఘం సభ్యులు కె.టి వెంకటేశ్వర్లు, కొండన్నగౌడు, బోడబండ సురేష్, జగదీష్, నాగేష్, అంపయ్య, బోయ మాదన్న, గోపాల్, నరసింహులు, శ్రీరాములు పాల్గొన్నారు.

జీఆర్‌పీ ఎత్తిపోతల నుంచి నీరు విడుదల

జీఆర్‌పీ ఎత్తిపోతల పథకంలో భాగంగా సోగనూరు చెరువు దగ్గర ఉన్న పంప్‌హౌస్-2 నుంచి సాగునీటిని మంగళవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి విడుదల చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పార్లపల్లి మల్లికార్జున, తిమ్మాపురం వెంకటేశ్వర్లు, కొండన్నగౌడు, శంకర్‌గౌడు, సోగనూరు జగదీష్, బోడబండ సురేష్‌చౌదరి, కనకవీడు డబ్బ ఈరన్న, జీఆర్‌పీ అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు

కౌతాళం, ఆగస్టు 6: నూతన తహసీల్దార్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన మల్లికార్జున స్వామిని మంగళవారం మండల టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, రైతు విభాగం జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ శివమోహన్ రెడ్డి, డమ్మలదిన్నె రమేష్‌గౌడ్, టిప్పుసుల్తాన్‌లు ఉన్నారు.

సాగు నీరు అందించాలి


రైతులతో మాట్లాడుతున్న కాలువ సూపర్‌వైజర్

కౌతాళం, ఆగస్టు 6: తమ కాలువకు రావాల్సిన నీటిని పూర్తి స్థాయిలో ఎల్ఎల్‌సీ అధికారులు వదలడం లేదని మంగళవారం కౌతాళం, రాజానగర్‌కు చెందిన రైతులు ఆందోళనకు దిగారు. అంతకు ముందు కౌతాళం డీపీ 75 కాలువలో పెరిగిన ముళ్ల కంపలను, గడ్డి మొక్కలను రైతులే కాలువలో దిగి శ్రమదానం చేసి నీరు ముందుకు పోయేలా చర్యలు చేపట్టారు. అనంతరం డీపీ-75కు చేరుకుని తమ కాలువకు వదిలే తూము వద్ద షెట్టర్ దాదాపు 60 రింగులకు పైగా తీయాల్సి ఉండగా ఎల్ఎల్‌సీ సూపర్‌వైజర్ పీర్ సాబ్, లస్కర్ డేవిడ్ ఆయకట్టు రైతులను ప్రోత్సహిస్తూ తమకు రావాల్సిన నీటిని అమ్ముకోవడంతో షెట్టర్ వద్ద కేవలం 16 రింగులు తీయడం ఏమిటని రైతులు ఆందోళనకు దిగారు. ఎల్ఎల్‌సీ అధికారులు తమకు న్యాయం చేసే వరకు ఇక్కడి నుంచి కదలమని హెచ్చరించారు. సమాచారం తెలుసుకున్న కాలువ సూపర్‌వైజర్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. పూర్తిస్థాయిలో కాలువకు నీరు వదులుతామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో రైతులు శ్రీనురాజు, దాట్ల సుబ్బరాజు, మల్లయ్య, డింగి రఘు, పుగ్గి నాగ, చంటి, ఈరన్న ఉన్నారు.

న్యాయవాదులపై దురుసుగా ప్రవర్తించిన వారిని శిక్షించాలి


రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు

పత్తికొండ టౌన్, ఆగస్టు 6: న్యాయవాదులపై దురుసుగా ప్రవర్తించిన వారిని శిక్షించాలని పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేష్, సీనియర్ న్యాయవాదులు ఎల్లారెడ్డి, మైరాముడు, సురేంద్ర కుమార్, కృష్ణయ్య, దామోదర ఆచారి అన్నా రు. మంగళశారం ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ న్యాయవాది సుబ్బారెడ్డిపై అనుచితంగా ప్రవర్తించిన నంద్యాల సీఐ రాజారెడ్డిపై అలాగే నందికొట్కూ రు న్యాయవాది గొల్ల శశిధర్‌లపై అలంపూరు పోలీసులు దాడి చేయడం దుర్మార్గమన్నారు. మంగళవారం పత్తికొండలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి స్థానిక ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రవికుమార్, కోశాధికారి రాజశేఖర్ నాయుడు, వాసుదేవ, న్యాయవాదులు కారప్ప, గోపాల్ రెడ్డి, హెచ్‌కే లక్ష్మన్న, సత్యనారాయణ, ఈరన్న, రమేష్‌బాబు, నగేష్, నరసింహయ్య, బాల్‌బాషా, రవిప్రకాష్, ప్రసాద్‌బాబు, నాగలక్ష్మయ్య, నారాయణస్వామి, పంపాపతి, మధుబాబు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై వినతుల స్వీకరణ


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ఆలూరు, ఆగస్టు 6: గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజినేయులు 3 రోజులుగా స్వగ్రామమైన ఆలూరులో మకాం వేశారు. ఆలూరు అభివృద్ధి, సమస్యలపై శాఖలు వారిగా చర్చిస్తున్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తూ పరిష్కారానికి కృషి చేస్తున్నారు. అధికారులు ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

కేవీకే శాస్త్రవేత్తల సలహాలు పాటించండి


మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్ర

ఎమ్మిగనూరు , ఆగస్టు 6: బనవాసి లో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తల సలహాలను పాటించాలని కేవీకే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్ర రైతులను కోరారు. మంగళవారం కేవీకేలో రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్తలు పంటల్లో యాజమాన్య పద్ధతులు సస్యరక్షణ, వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు తెలియజేశారు. అలాగే పొద్దుతిరుగుడు పువ్వు మినీకిట్లు విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఆసక్తిగల రైతులు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. అలాగే కేవీకేలో కొత్త విత్తనాలు ట్రైకోడర్మ, సుడోమోనాస్ రకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన రైతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

సీఐను కలిసిన టీడీపీ నాయకులు


సీఐను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కోసిగి, ఆగస్టు 6: కోసిగి సీఐగా బాధ్యతలు చేపట్టిన బీఏ మంజునాథ్‌ను కర్నూలు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నాడిగేని అయ్యన్న, వక్రాణి వెంకటేశ్, జక్కనగేని వెంకటేశ్, బుజ్జి, నరసింహులు, గోపాల్, వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

వంకలో పేరుకుపోయిన పూడికతీత

ఎమ్మిగనూరు , ఆగస్టు6: పట్టణంలోని శిల్పా ఎస్టేట్ వెనుక ప్రాంతంలో ఉన్న వంకలో పూడిక పేరుకు పోవడంతో వర్షపునీరు పారేందుకు అడ్డంకిగా మారింది. దీంతో మున్సిపల్ అధికారులు మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో మిలటరీ కాలనీ రోడ్డు నుంచి కోసిగి రోడ్డులో వడ్డె గిరప్ప వంక వరకు పూడిక తీత పనులను చేపట్టారు. ఆయన వెంట డీఈ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

పురపాలక స్థలాలకు రక్షణ కల్పించాలి

ఆదోని టౌన్, ఆగస్ట 6: మండిగిరి ప్రాంతంలోని మున్సిపాలిటీకి చెందిన ఖాళీ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని, అధికారులు భూములను కాపాడాలని మండిగిరి టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాస ఆచారి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కాలనీలో అనేక లే అవుట్లు ఉన్నాయని, గతంలో కొందరు కబ్జాలకు ప్రయత్నాలు చేస్తే తాము అడ్డుకున్నామని అన్నారు. కాలనీలోనీ లేఅవుట్ టీపీ నంబర్ 1-93లో పురపాలకానికి చెందిన కాళీ స్థలంలో వెనుక భాగంలో స్థలం అన్యాక్రాంతమైందన్నారు. ఖాళీ స్థలాలకు ప్రహరీ నిర్మించి కాపాడాలని ఆయన కోరారు.

ఆలూరు సమస్యలపై మంత్రి నారా లోకేశ్‌కు విన్నతి

ఆలూరు, ఆగస్ట 6: ఆలూరు నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మంగళగిరిలో కలిసి విన్నవించినట్లు మాజీ జడ్పీటీసీ మీనాక్షి నాయుడు, టీడీపీ నాయకులు వెంకటేష్ చౌదరి, రాజశేఖర్ తెలిపారు. వెనుకబడిన నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న వేదవతి, నగరడోణ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలన్నారు. అలాగే హంద్రీ నీవా తూము ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కలిసిన వారిలో ఆలూరు టీడీపీ మండల కన్వీనర్ అశోక్ యాదవ్, చిప్పగిరి ఎంపీటీసీ రజినీ, నాయకులు చంద్ర, మారుతి చౌదరి, తిప్పయ్య, వెంకటేష్, ముత్యాల రెడ్డి ఉన్నారు.

వెల్దుర్తిలో సెల్‌ఫోన్లు, నగదు, ఇటుకలు చోరీ

వెల్దుర్తి, ఆగస్టు, 6: వెల్దుర్తిలో బండల షాపు, అమీర్ రేడియం పాయింట్ షాపులలో రూ.5వేలు నగదు, పక్కనే ఉన్న ఇంటి నిర్మాణానికి తెచ్చిన ఇటుకలను 200 ఇటుకలు అహపరించుకెళ్లారు. నారాయణరెడ్డి నగర్ కాలనీకి ఎదురుగా ఉన్న సెల్‌ఫోన్ దుకాణంలో ఒక్కొక్కటి రూ.15 వేలు విలువ చేసే సెల్‌ఫోన్లు ఏకంగా 11 స్మార్ట్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సీఐకు జన విజ్ఞాన వేదిక సన్మానం


సీఐ శ్రీరామను సన్మానిస్తున్న నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్ట 6: ఆదోని ఒకటవ పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీరాముడును మంగళవారం జన విజ్ఞాన వేదిక నేషనల్ యాంటీ కరప్షన్ అండ్ ఆపరేషన్ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. పోలీస్ స్టేషన్‌లో సీఐకు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్, జనసేవా సంస్థ అధ్యక్షుడు విరుపాక్షి స్వామి శాలువ కప్పి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు సంతోష్, నరేష్, రంగస్వామి, భరత్, రాజేష్, లక్ష్మీప్రసాద్, చిన్న పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అవసరం

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 6: క్రీడాకారులకు ప్రోత్సాహం ఎంతో అవసరమని పెద్ద హరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇందిరా దేవి అన్నారు. మంగళవారం పాఠశాలలోని క్రీడాకారులకు ఆ గ్రామ కనక టీంకు చెందిన సీనియర్ క్రీడాకారులు విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. ఆమె మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో, జాతీయ రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. చదువులే కాదు ఆటలోనూ తమ విద్యార్థులు ముందుంటారన్నారు. రిటైర్డ్ హెచ్ఎం రాము, ఫిజికల్ డైరెక్టర్ రామన్న, సీనియర్ క్రీడాకారులు నాగరాజు, వెంకటేష్, వీరేష్, గొల్ల వీరేష్, భాస్కర్, శ్రీకాంత్, సోము పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భవనం నిర్మించాలి

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 6: ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. మంగళవారం యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పట్టణ అధ్యక్షుడిగా సూరి, కార్యదర్శి గౌడ్, ఉపాధ్యక్షులుగా శశిధర్, నాగరాజు, సహాయ కార్యదర్శులు భరత్, లోకేష్ వెంకట్‌తో పాటు మరో పది మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భక్తుల సౌకర్యార్థం వీధి లైట్లు ఏర్పాటు చేయాలి

ఆదోని టౌన్, ఆగస్టు 6: పట్టణ పొలిమేరలలోని కొండలపై వెలసిన రణమండల ఆంజనేయస్వామి దేవస్థానానికి తెల్లవారుజామున కాలి నడకన వెళ్లే భక్తుల కోసం వీధి లైట్‌లను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి రమేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు దిలీప్ ధోకా కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డిని కలిసి కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి రావు, పట్టణ అధ్యక్షుడు సాయి నాథ్, దేవిశెట్టి వీరేష్, రామకృష్ణ రెడ్డి, హుస్సేనప్ప, యాదవ్ పాల్గొన్నారు.

పచ్చదనం పెంపునకు అందరూ కృషి చేయాలి

ఆదోని టౌన్, ఆగస్టు 6: పచ్చదనం పెంపుతో పర్యావరణ పరిరక్షణకు అవకాశం ఉందని, ప్రతి ఒక్కరు పచ్చదనాన్ని పెంచి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మహావీర్ కాలనీలోని మున్సిపల్ పా ర్కులో ఆయన మొక్కలను నాటారు. ప్రతి కాలనీలోని స్థానికులు మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని ఆయన సూచించారు.

నాయి బ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాలి

మద్దికెర, ఆగస్టు 6: మండలంలోని నాయీ బ్రాహ్మణులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు మంగళి వీరేంద్ర అన్నారు. మంగళవారం స్థానిక నాయీ బ్రాహ్మణ కాలనీలో సంఘం సమావేశం జరిగింది. నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఆరోగ్య వైద్యులు రామాంజనేయులు, ఎం.నాగభూషణం, అధ్యక్షులుగా ఎం.వీరేంద్ర, ఉపాధ్యక్షుడిగా ఎం. ఓబులేసు, కార్యదర్శిగా ఎం ఎర్రి స్వామి, సలహాదారులుగా రంగస్వామి, సభ్యులుగా శేఖర్, రమేష్, రామచంద్రలను ఎన్నుకున్నారు.

సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

హొళగుంద, ఆగస్టు 6: అధికారులు సమస్యలపై దృష్టి పెట్టి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరి ష్క రిం చా లని ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే బుశినేని విరుపాక్షి అన్నారు. హొళగుందలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నూర్ జాహన్ బీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులుకు ప్రభుత్వ కార్యక్రమలకు సమాచారం అందించాలని అన్నారు. రోడ్లు, తాగునీటిపై సమస్యలపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ, వైస్ ఎంపీపీ గాదెమ్మ, డీడీవో నాగేశ్వర్ రావు, ఎంపీడీవో ఆజాద్, ఈవోఆర్డీ చంద్రమౌళీశ్వర్ గౌడ్, పీఆర్‌జేఈ సోమప్ప, డిప్యూటీ తహసీల్దార్ నిజముద్దీన్, ఎంఈవో జగన్నాథం, సత్యనారాణ, అగ్రికల్చర్ ఏవో ఆనంద్ లోకదళ్ పాల్గొన్నారు.

రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలి

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 6: ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఉన్న బాలికల హాస్టల్‌కు రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలని డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఛాంబర్ ముందు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న బాలికలతో నెలకు రూ.1800 పనులు చేస్తున్న రెగ్యులర్ వార్డెను ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. అనంతరం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాలస్వామికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, నరసింహులు, వినిల్, రాజేష్, విక్రమ్, హనుమేష్, వీరభద్ర పాల్గొన్నారు.

గ్రామాల్లో సిద్ధంగా ఉపాధి పనులు

పెద్దకడబూరు ఆగస్టు 6: గ్రామాల్లో పనిచేసేందుకు ఉపాధి పనులు సిద్ధంగా ఉన్నాయని పీడీ అమర్నాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దకడబూరులోని సచివాలయం-2లోని రైతులు, ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకి రూ. 300 ఉపాధి వేతనం ఉంటుందన్నారు. 5 ఎకరాలలోపు ఉన్న రైతులు పండ్ల మొక్కలు పెంచుకోవడం ద్వారా అదనపు ఆదాయం వస్తుందన్నారు. చదువుకున్న యువతి యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ పై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యంపిడివో జనార్థన్,జేఈ ఖాదర్, సిబ్బంది గిడ్డయ్య, రాంమోహన్ రెడ్డి, టీఏలు, మెట్‌లు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం ధ్వంసం

ఆదోని, ఆగస్టు 6: వివిధ కేసుల్లో పట్టుబడిన కర్ణాటక మద్యంతో పాటు నాటు సారాను ట్రాక్టర్ సహాయంతో సెబ్ అధికారులు ధ్వంసం చేశారు. మంగళవారం ఇస్వీ గ్రామ సమీపంలోని రహదారిపై ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన 37 కేసులలో సుమారు రూ.3.5లక్షల విలువ చేసే 476 లీటర్ల కర్ణాటక మద్యము, 108 లీటర్ల నాటుసారాయిని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ జిల్లా వినోద్ కుమార్, సీఐ విస్సీలత తెలిపారు.

నిబద్ధతతో పనిచేయాలి

ఆదోని రూరల్, ఆగస్టు 6 : ప్రతి ప్రభుత్వ ఉద్యోగి నిజాయితీగా, నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు వస్తుందని ఆదోని రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. నిరంజన్‌రెడ్డి కర్నూలు హెడ్ క్వార్టర్‌కు బదిలీ అయ్యాడు. డీఎస్పీ శివ నారాయణ స్వామి ఆధ్వర్యంలో మంగళవారం తాలుక పోలీస్‌స్టేషన్‌లో సిఐకు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎస్.ఐలు ఎర్రిస్వామి, శ్రీనివాసులు, పీరయ్య,సిబ్బంది పాల్గొన్నారు.

వరుణుడి కరుణ కోసం సర్వ మత ప్రార్థనలు


ప్రార్థనలు చేస్తున్న సర్వ మత గురువులు

ఆదోని టౌన్, ఆగస్ట 6: సమృద్ధిగా వర్షాలు కురవాలని ఎమ్మెల్యే డా. పార్థసారథి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సర్వ మత ప్రార్థనలు చేశారు. హిందూ, క్రిస్టియన్, ముస్లింలో మతాలకు చెందిన గురువులు తమ సంప్రదాయాల ప్రకారం వరుణుడి కోసం ప్రార్థనలు చేశారు.